
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 145 | హైదరాబాద్ | మంగళవారం 25-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

పంచాయతీ ఎన్నికలు..
అభ్యర్థులకు కేరళలోని రైతు సంఘం షరతు

## బాబోయ్.. బయో

- రోజుకు 31.27 టన్నుల వ్యర్థాల ఉత్పత్తి
- నిబంధనలు పాటించని 141 ఆసుపత్రులకు నోటీసులు
- పీసీబీ వార్షిక నివేదికలో కీలక విషయాలు



11లో



### ఢిల్లీకి నోయిడా..
## తెలంగాణకు కొడంగల్

- అంతర్జాతీయ స్థాయిలో లగచర్ల పారిశ్రామికవాడ
- మహిళల ఉత్పత్తుల విక్రయానికి అమెజాన్‌తో సంప్రదింపులు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి భూమిపూజ

11లో



### అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో
## భారత్‌కు రష్యా చమురు

- నవంబర్ 21 నుంచి రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు
- గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తగ్గింపుకు చమురు
- బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపు ధర

11లో



### కొత్త సీజేఐ కోసం అధికారిక కారును రాష్ట్రపతి భవన్ వద్ద
## వదిలి వెళ్లిన జస్టిస్ గవాయ్

- 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్
- అధికారిక కారులో రాష్ట్రపతి భవన్‌కు వచ్చిన జస్టిస్ గవాయ్
- జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టాక

11లో



కారును అక్కడే వదిలిన గవాయ్



11లో

### ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం
## ప్రజల్లోకి వెళ్లాలి

ప్రజలకు మరింత మెరుగ్గా పౌరసేవలు అందించాలని అధికారులకు సీఎం ఆదేశం

- గ్రామ, వార్డు సభల ఆమోదం లేకుండా ఏ పనులూ చేపట్టవద్దని స్పష్టీకరణ
- వాతావరణ సమాచారం సహా 42 అంశాలతో 'అవేర్' యాప్ విడుదలకు నిర్ణయం
- సుపరిపాలనపై ఎమ్మెల్యేలు, ఎంపీలకు డిసెంబరులో ప్రత్యేక వర్క్‌షాప్
- ప్రభుత్వ పథకాల అమలులో జవాబుదారీతనం అత్యంత కీలకమని వెల్లడి

## బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు

- రెండు రోజుల్లో తుపాను ఏర్పడే అవకాశం

11లో





11లో

### కేసు రాజీ జరుగుతుంటే..
## మీరేం చేశారు?

- తితిదే పూర్వ వీజీవో గిరిధర్‌పై సీఐడీ బృందం ప్రశ్నల వర్షం
- 'పరకామణి' కేసు దర్యాప్తు వేగవంతం

భారత శక్తి

# ఇక విద్యావిధానంపై దృష్టి

ప్రధాని నరేంద్రమోదీ మెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారత్ నుంచి పూర్తిగా తొలగించాలనే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పొచ్చు. ఇది భారత ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే సాహసోపేత ప్రయత్నం. ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతుంది. ఆర్టిఫిషియల ఇంటలిజెన్స్ అంటే అంతర్జాతీయ మేధస్సు ముఖ్యంగా అమెరికా టెక్నాలజీ ప్రభావం ప్రపంచాన్ని ఒకే గ్లోబల్ విలేజ్‌గా మార్చేస్తోంది. అందువల్ల ప్రపంచ ధోరణికి అనుగుణం గా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.దేశ భవిష్యత్తు నిర్మాణానికి అఖండ పునాదిగా నిలవాల్సిన భారత విద్యా వ్యవస్థ,, నేడు లోపాలు, నిర్లక్ష్యం, అసమానతల భారంతో ఆధారాలు దెబ్బతిన్న శిఖరంలా విద్యా వ్యవస్థ క్రమంగా క్షీణిస్తోంది. విద్య కేవలం బోధన కాదు, అది ఆర్థిక స్వావలంబనకు, సాంకేతిక శక్తి సంపన్నతకు, సామాజిక న్యాయ సాధనకు మార్గం చూపే విప్లవాత్మక శక్తి. ప్రతి విద్యార్థి సక్రమంగా మానవ వనరుగా వికసిస్తే భారతదేశం జ్ఞాన విప్లవానికి కేంద్రబిందు వుగా అవతరిస్తుంది. కానీ ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిధుల లోటు, విధాన అస్పష్టత నాణ్యమైన విద్యను అడ్డుకుని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దెబ్బతీశాయి.ఏడు దశాబ్దాల సంస్కరణలు, విద్యా కమిషన్లు, విధానాలు గుణాత్మక విద్యను అందించడంలో విఫలమయ్యాయి. అక్షరాస్యత 80.9% ఉన్నప్పటికీ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. నూతన జాతీయ విద్యా విధానం-2020 అవకాశాలు, సవాళ్లు రెండూ కలిగి ఉన్నప్పటికీ, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా దాన్ని మలచుకుంటే విద్యలో నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుంది.భారత విద్యా వ్యవస్థలో అత్యంత ఆందోళనకర అంశం స్థూల నమోదు నిష్పత్తి క్షీణత. విద్యా స్థాయిలు పెరిగే కొద్దీ విద్యార్థుల నమోదు పడిపోవడం దేశ భవిష్యత్తుకే సవాలుగా మారింది. 'యునైటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్' ప్రకారం ప్రాథమిక స్థాయిలో నమోదు 82.2%, హయ్యర్ సెకండరీలో 35.8%, ఉన్నత విద్యలో కేవలం 28.4% మాత్రమే. నూతన విద్యా విధానం 2035 నాటికి 50% లక్ష్యం నిర్దేశించినా, ప్రస్తుత స్థితిలో అది కష్టసాధ్యం. అభివృద్ధి చెందిన దేశాలు 6?8% జీడీపీని విద్యపై ఖర్చు చేస్తే, భారత్ ఇంకా 3% కన్నా తక్కువే ఖర్చు చేస్తోంది. కొఠారి కమిషన్ సూచించిన 6% పెట్టుబడి ఇప్పటికీ నెరవేరలేదు. ఉన్నత విద్యలో సీట్ల కొరత, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఆర్థిక లోటు, మాతృభాష బోధన లోపం సమస్యలుగా మారాయి. ఫలితంగా యువత నాణ్యమైన విద్యను పొందడంలో వెనుకబడుతోంది. అందువల్ల విద్యా సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక విధానాల అమలు అత్యవసరం.భారత విద్యా వ్యవస్థ నాలుగు స్థాయిల్లో అభివృద్ధి చెందుతున్నా ప్రతి దశకు ప్రత్యేక సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో సర్వశిక్షా అభియాన్, మిడ్‌డే మీల్స్‌తో చేరిక పెరిగినా మౌలిక వసతుల లోపం, ఉపాధ్యాయుల కొరత, నేర్చుకునే సమస్యలు ఉన్నాయి. మాధ్యమిక స్థాయిలో నమోదు ఎక్కువైనా బాలికల డ్రాప్ అవుట్, పాత సిలబస్, నైపుణ్యాభివృద్ధి లోపం సమస్యలుగా ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో పరీక్షా ఒత్తిడి, ఆత్మహత్యలు, అధ్యాపకుల కొరత, ప్రైవేట్ కోచింగ్ ఆధిపత్యం విద్యను భారంగా మారుస్తున్నాయి. ఉన్నత విద్యలో ఐఐటీలు, ఐఎంఎంలు అంతర్జాతీయ గుర్తింపు పొందినా, 'కేంద్ర విశ్వవిద్యాలయాలు' పరిమిత అందుబాటుతో సాధారణ విద్యార్థులకు అందని ద్రాక్షలుగా మారాయి. 'రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' నిధుల కొరత, అధ్యాపకుల ఖాళీలతో బలహీనపడుతున్నాయి. 'పరిశోధన'పై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోంది.వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు.. అధ్యాపకులు లేకుండా ఎలా చదువుతున్నారు, ఎలా పరీక్షలు రాస్తున్నారు, ఎలా ఉత్తీర్ణులవుతున్నారు అనేదే పెద్ద ప్రశ్న. 'ప్రైవేట్ యూనివర్సిటీలు' ఆధునిక సదుపాయాలు కలిగివున్నప్పటికీ, అధిక ఫీజుల సామాన్య విద్యార్థులకు అందుబాటులో లేవు, వాటిలో రిజర్వేషన్ల అమలు లేదు. యూనివర్సిటీలకుఎన్ఐఆర్ఎఫ్ లో ప్రాంతీయ బలాలు కాపాడుతూ గ్లోబల్ ప్రమాణాలు సాధించడం సవాలుగా మారింది. 'స్కిల్ యూనివర్సిటీలు' స్థాపించడం ద్వారా, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ నైపుణ్యాధారిత విద్యా వ్యవస్థను బలపరచడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. విద్యా అవకాశాలు విస్తరించినప్పటికీ నాణ్యతలో అసమానత పెరుగుతోంది. దీన్ని అధిగమించడానికి కేంద్ర,రాష్ట్ర సమన్వయం, స్థిరమైన నిధుల కేటాయింపు, నైపుణ్య ఆధారిత విద్యా విధానం, పరిశోధన ప్రోత్సాహం అత్యవసరం. విద్య-ఉద్యోగ అనుసంధాన లోపంతో ఇవి కేవలం నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగానే మిగిలిపోతున్నాయనడంలో సందేహం లేదు.సాంకేతికత ఆధునిక ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, డిజిటల్ గవర్నెన్స్, స్పేస్ రీసెర్చ్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాలను సమర్థవంతంగా నడిపే సాధనం 'శక్తివంతమైన విద్యా విధానం'. ప్రస్తుత పరీక్షా వ్యవస్థ, మార్కులు, ర్యాంకులపై ఆధారపడటం, విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను అణచి, 'పట్టా ఉన్నా ఉద్యోగం లేని' పరిస్థితిని సృష్టిస్తోంది. సమాచార యుగంలో ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ అధ్యాపక మార్పిడి, శాస్త్ర,సాంకేతిక నైపుణ్యాలు అత్యవసరం. పాఠశాల స్థాయిలో బలమైన శాస్త్ర విద్య, నైపుణ్యాధారిత బోధన, అనుభవాత్మక పాఠ్య ప్రణాళిక అవసరం. డిజిటల్, ఇన్నోవేషన్ కోర్సులు, ఆన్‌లైన్ లెర్నింగ్ గ్రామీణ విద్యార్థులకు కొత్త అవకాశాలను ఇస్తాయి.స్థిరమైన ప్రగతికి మౌలిక వనరుల పెంపు, ఆధునిక సిలబస్, పరిశోధన ప్రోత్సాహం, నైపుణ్య ఆధారిత కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ టెక్నాలజీ వంటి రంగాలను తప్పనిసరిగా చేరవేయాలి. యూనివర్సిటీలలో 'పారిశ్రామిక విభాగాలు' స్థాపించడం ద్వారా విద్య,ఉద్యోగ అనుసంధానం బలపడుతుంది. పాలన, ఆర్థిక సామర్థ్యం ఆధారంగా రాష్ట్రాల సంస్కరణల్లో వైవిధ్యం కొనసాగుతోంది. రాష్ట్ర యూనివర్సిటీలకు ప్రత్యేక బ్లాక్ గ్రాంట్లు, ప్రైవేట్ యూనివర్సిటీలలో 'ఫీజుల నియంత్రణ కమిషన్' ఏర్పాట్లు అవసరం. విద్యను శక్తివంతమైన సాధనంగా మార్చి, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడానికి, అన్ని రాష్ట్రాలు ప్రత్యేకంగా విప్లవాత్మక మార్గదర్శిగా, అధికారిక పత్రంగా 'నూతన విద్యా విధాన పత్రం'లను రూపొందించుకోవడం అత్యవసరం.

# కాంగ్రెస్‌కు షర్మిల మాత్రమే...

విజయవాడ, నవంబర్ 24



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు ఎవరూ కనిపించడం లేదు. కేవలం పార్టీ చీఫ్ వైస్ షర్మిల మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. అసలు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో వైస్ షర్మిల కాకుండా మరొక నేత లేరా? అన్న అనుమానం కలుగుతుంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలోపేతం కాదన్న నిరాశ అన్నది తెలియదు. వైఎస్ షర్మిల నాయకత్వంలో పనిచేయడం ఇష్టం లేక కావచ్చు. 2004 నుంచి 2014 వరకూ కేంద్ర మంత్రులుగా, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రులుగా పనిచేసిన వారు ఇప్పుడు వాయిస్ వినిపించడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం పోస్ట్ మార్టం చేసుకుంటే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి.. ఇప్పటికే వైఎస్ షర్మిల కాంగ్రెస్ ను ఒక ప్రాంతీయ పార్టీ తరహాలో నడుపుతున్నారన్న టాక్ పార్టీలో ప్రముఖంగా వినిపిస్తుంది. జేడీ శీలం, పల్లంరాజు, రఘువీరారారెడ్డి, చింతా మోహన్ వంటి వారు కూడా బయటకు రావడం లేదు. గతంలో పార్టీ ఓడిపోయినా ఒకింత యాక్టివ్ గా ఉండే వీరు ఇప్పుడు మౌనంగా ఉండటం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే ఏదైనా పని ఉంటే నేరుగాఢిల్లీకి వెళుతున్నారు తప్పించి వీరు రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా ఆసక్తిచూపడం లేదు. వైఎస్ ర్మిలను పీసీసీ చీఫ్ చేసిన తర్వాత పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోయిందన్న నివేదికలు పార్టీ నాయకత్వానికి అందినా అంతకు మించిన నాయకత్వం ఎవరూ లేకపోవడంతో హైకమాండ్ కూడా ఏమీ చేయలేకపోతుందంటున్నారు. అన్ని రాష్ట్రాల్లో క్రమంగా పట్టు కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీ అసలు ఏమీ లేని రాష్ట్రంలో ఎందుకు చర్యలు తీసుకుంటుందంటున్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ జీరో పెర్ ఫార్మెన్స్ కాంగ్రెస్ పార్టీ చూపించింది.

ఇక ఆ పార్టీలో దీర్ఘకాలంగా ఉన్న అనేక మంది నేతలు ఎక్కువ మంది వైసీపీకి,మరికొంత మంది టీడీపీలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్న నేతలు లేటు వయసులో పార్టీ మారడం ఎందుకన్న భావనతో ఊరుకున్నారు కానీ, వారు కూడా రాజకీయంగా ఎదగాలని కోరిక ఉంటే పార్టీ ఎప్పుడో మారే వారు. చింతా మోహన్ అప్పడప్పుడు తన వాయిస్ ను వినిపిస్తున్నప్పటికీ ఆయన పెద్దగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు.వైఎస్ తనయగా షర్మిల కాంగ్రెస్ పార్టీని ఇంచు కూడా ఎదిగేలా చేయలేకపో?యిందన్న విమర్శలు ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.


# 28న 25 బ్యాంకులకు శంఖుస్థాపన

విజయవాడ, నవంబర్ 24

అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. భారీగా నిధులు కూడా కేటాయించింది. రోడ్డుతో పాటు రైల్వే ప్రాజెక్టులను సైతం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి అమరావతికి ఫుల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టనుంది. రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం తో పాటు ఏకంగా 25 జాతీయ, ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈనెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో ఒకేసారి శంకుస్థాపనలు కూడా జరగనున్నాయి. ఇది నిజంగా రికార్డ్. ఒక విధంగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టే.అమరావతిలో ఆర్బిఐ తోపాటు బ్యాంకులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. అందులో ఓ 12 ఎక్కరాలు రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు అధికారులతో పాటు సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించారు. మిగతా ఓ 38 ఎకరాల్లో దేశంలో పేరు మోసిన బ్యాంకులకు సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి. సాధారణంగా బ్యాంకింగ్ సెక్టార్ అంటేనే కేంద్ర ఆర్థిక శాఖతో కూడుకున్నది. పైగా వాటి నిర్మాణాలు కూడా చాలా వేగంగా జరుపుతారు. వచ్చే రెండేళ్లలో అమరావతిలో ఈ బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అదే జరిగితే ఆర్థిక శాఖ పరంగా కూడా అమరావతి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం ఖాయం.అమరావతి విషయంలో ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్పార్టీ వెనక్కి తగ్గింది. వర్షాలు వచ్చే సమయంలో అమరావతికి వరద పోటు అంటూ ప్రచారం చేసేది. అయితే కేంద్రం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వైసిపి ఆలోచనలో పడింది. అయితే ఇప్పుడు ఈ ఆర్థిక బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతిపై జరిగే వ్యతిరేక ప్రచారానికి చెక్ పడినట్టే. 2014 నుంచి 2018 మధ్య తెలుగుదేశం ఎన్డీఏలో కీలక భాగస్వామి. కానీ ఇటువంటి పరిణామాలేవి అమరావతి విషయంలో జరగలేదు. మునుపెన్నడూ లేని విధంగా అమరావతి విషయంలో కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు ఆర్థిక శాఖకు సంబంధించిన బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతి ఆర్థిక రాజధానిగా మిగతా రాష్ట్రాలు గుర్తించడం ఖాయం. ఎందుకంటే ఒకే చోట 25 జాతీయ బ్యాంకులు, వాటి ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు చిన్న విషయం కాదు. ఈ విషయంలో మాత్రం మిగతా రాజధానుల కంటే అమరావతి మెరుగైన స్థితిలో ఉన్నట్టే.

# కమలం గూటికి కేశినేని నాని

విజయవాడ, నవంబర్ 24,



విజయవాడ మాజీ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని తిరిగి రాజకీయంగా యాక్టివ్ కావాలని భావిస్తున్నట్లుంది. తన సోదరుడు కేశినేని శివనాథ్ పై ఇటీవల కాలంలో సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలతో ఆయన మరొకసారి రాజకీయంగా తానేంటో చూపాలనుకుంటున్నారు. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్లు సమయం ఉంది. అయితే కేశినేని నాని గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరినప్పటికీ, ఆయన ఇప్పుడు మనసు మార్చుకుని బీజేపీ లో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. పదేళ్ల పాటు పార్లమెంటు సభ్యుడిగా ఉన్న కేశినేనినాని ఢిల్లీలో తనకున్న పరిచయాలతో త్వరలోనే బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. విజయవాడ పార్లమెంటుకు 2024, 2019 ఎన్నికల్లో గెలిచిన కేశినేని నాని ఏనాడూ పెద్దగా విమర్శలు ఎదుర్కొనలేదు. ఇప్పుడు తన సోదరుడితో పోల్చుకుంటే కేశినేనినాని బెటర్ అన్న పేరును బెజవాడ ప్రాంతంలో తెచ్చుకున్నారు.దీంతో కేశినేని నాని మరోసారి విజయవాడ నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఇటీవల బీజేపీ కేంద్ర నాయకత్వంలోకి టచ్ లోకి వెళ్లిన కేశినేని నాని హస్తిన కు వెళ్లి పార్టీ కండువా కప్పుకోవాలని సిద్ధమవుతున్నారని తెలిసింది. అన్నీ అనుకూలిస్తే వచ్చేఏడాది ఆరంభంలోనే ఆయన కమలం తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నాయని చెబుతన్నారు. ఈ మేరకు ఆయన సన్నిహితులకు కూడా ఈ సమాచారం చెప్పినట్లు తెలిసింది.. విజయవాడ అంటే ప్రేమ అని పిచ్చి అని కేశినేని నాని గతంలో ఒక సందర్భంలో తెలిపారు. విజయవాడ అంటే ప్రేమతోనే తాను రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ సేవ చేయడానికి ముందుంటానని తెలిపారు. అయితే సేవ చేయాలంటే రాజకీయాలు అవసరమని గుర్తించిన కేశినేని నాని త్వరలోనే బీజేపీ జెండా పట్టుకుని తిరిగే అవకాశాలున్నాయంటున్నారు. కేశినేని నాని రాజకీయంగా రీ ఎంట్రీ ఇవ్వాలంటూ ఆయన సన్నిహితులు కూడా వత్తిడి తెస్తున్నారు. అంతకు ముందుగానే కేశినేని నాని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి తన అనుచరులును, అభిమానులను కలుసుకుని సమావేశాలను ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. మొత్తం మీద కేశినేని తిరిగి యాక్టివ్ అవుతానని చెబుతుండటంతో కేశినేని అనుచరుల్లో పొలిటికల్ కిక్కు వచ్చిందట.

# ఓఆర్ ఆర్ అడుగులు...

గుంటూరు, నవంబర్ 24, (

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుపై కీలకమైన అప్ డేట్ వచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామాల నుంచి 3ఏ ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థ అధికారులకు చేరాయి. కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిపాదనలు అందనున్నాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఏలూరు, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల మీదుగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ వెళ్లే గ్రామాల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లా నుంచి ప్రతిపాదనలు ఢిల్లీకి చేరాయి. ఒకట్రెండు రోజుల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థకు చేరనున్నాయి. ఆ తర్వాత కొన్ని దశల అనంతరం భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నారు.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి మరో అప్ డేట్ వచ్చింది. ఏపీ రాజధాని అమరావతి ని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా అమరావతి రైల్వే లైన్, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు , అమరావతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, అమరావతి క్రికెట్ స్టేడియం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతున్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలో కీలకమైన అడుగు పడింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ జిల్లాలలోని 23 మండలాల పరిధిలోని 97 గ్రామాల మీదుగా వెళ్లేలాఅమరావతి ఔటర్ రింగ్ రోడ్డును డిజైన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల నుంచి అధికారులు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 3ఏ ప్రతిపాదనలు జాతీయ రహదారుల అధికారుల వద్దకు చేరాయి. కృష్ణా జిల్లా నుంచి ప్రతిపాదనలు రానున్నాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని దశలు పూర్తి అయితే.. భూసేకరణ మొదలుపెట్టాలని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు 190 కిలోమీటర్ల పొడవుతో అమరావతి రాజధాని చుట్టూ ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రణాళికలు రచించారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు డీపీఆర్ సైతం ఇప్పటికే ఢిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వద్దకు చేరింది. 97 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్లనుంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి మైలవరం, కంచికచర్ల,, జి.కొండూరు, వీరులపాడు మండలాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్తోంది. ఈ మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ నిర్మాణంపై ఇప్పటికే ఆరు గ్రామాల ప్రతిపాదనలు అధికారులకు చేరాయిఅయితే ప్రతిపాదనల్లో కొన్ని లోపాలు ఉన్నాయనే



కారణంతో ఎన్‌హెచ్ అధికారులు వెనక్కి పంపారు. దీంతో రెవెన్యూ అధికారులు వాటిని సరిచేసి, మరికొన్ని గ్రామాల ప్రతిపాదనలను చేర్చి 3ఏ ప్రతిపాదనలు ఎన్‌హెచ్ అధికారులకు పంపించారు. భూమి వివరాలు, సర్వే నంబరులో ఎంత ఉంది.. రహదారి నిర్మాణం కోసం ఎంత భూమిని తీసుకుంటున్నారనే వివరాలు అందులో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలను జాతీయ రహదారుల సంస్థ అధికారులు పోర్టల్‌లో నమోదు చేస్తారు. అనంతరం ఢిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కార్యాలయానికి.. రోడ్లు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ అధికారులకు పంపిస్తారు.

# దారికొస్తున్న బంగ్లాదేశ్

న్యూఢిల్లీ, నవంబర్ 24, బంగ్లాదేశ్.. మన పొరుగున ఉన్న ఇస్లాం దేశం. భారత్‌తో ఏడాది క్రితం వరకు బంగ్లాదేశ్ సత్సంబంధాలు కొనసాగించింది. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత.. కొత్తగా ఏర్పాడిన మహ్మద్ యూనస్ ప్రభుత్వం భారత వ్యతిరేక ధోరణి అవలంబిస్తోంది. ఇందులో భాగంగా చికెన్స్ నెక్ (సిరిగుడి కారిడార్) దక్షిణ ఆసియాలోని ప్రాముఖ్యత ఎక్కువగా ఉంది. దీనిని పాకిస్తాన్, చైనాతో కలిసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోంది. 4 వేల కిమీపైగా సరిహద్దులు కలిగిన బంగ్లాదేశ్‌కు భారతదేశం సాంప్రదాయికంగా ముఖ్యమైన భాగం.కొన్ని రోజులుగా బంగ్లాదేశ్ పాకిస్తాన్, చైనా సహకారంతో చికెన్స్ నెక్‌ను ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తోందంటూ వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అంశం దక్షిణ ఆసియా భౌరూపంలో సాంకేతిక, విదేశాంగ పనితీరు మరింత క్లిష్టతను తెస్తే, భారత్ మరోవైపు రెండు వైపులా ప్రక్కనే ఉన్న బంగ్లాదేశ్‌కు తెరువునిచ్చి, మైత్రి బలపరచడంలో ఆసక్తి చూపుతోంది.బంగ్లాదేశ్ మరోవైపు, స్వంత స్వాభావిక, ఆర్థిక అవసరాల కోసం భారతదేశంతో కలిసి పనిచేయాల్సిన అవసరం తేలింది. దేశంలో తాత్కాలిక అధ్యక్షుడు చేస్తున్న చైనా, పాకిస్తాన్ సహకార ఉన్నప్పటికీ, ఉత్పాదకత, రవాణా, నీటి వినియోగాల క్రమం చూస్తే భారత్‌తో సహకారం తప్పనిసరిగా కొనసాగించడం అవసరం. జార్ఖండ్ స్విచ్‌లు, నీటి వినియోగం వంటి అంశాలు బంగ్లాదేశ్‌లో కరువు, వరదల నివారణకు భారత సహాయాన్ని కోరుతాయి.

# రేణుకా చౌదరి పర్యటనను జయప్రదం చేయండి.

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురజాల గోపి పిలుపు



మణుగూరు, నవంబర్ 24 (భారతశక్తి): మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి పిలుపునిచ్చారు. ముందుగా రేణుక చౌదరి క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమవారం రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. మరో పది రోజుల్లో ఫైర్ బ్రాండ్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి పినపాక నియోజకవర్గంలో పర్యటన ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఫైర్ బ్రాండ్ పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా నియామకమైన తోట దేవి ప్రసన్నకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతూ నిధులు వరదలా తీసుకు వస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి పదంలో నడిపించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషికి, ఎంపీ బలరాం నాయక్ నిధులు తోడవడం వలన మణుగూరుకి ఈఎస్ఐ హాస్పిటల్ రావడం అభినందనీయమన్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి పర్యటన అనంతరం ఎంపీ బలరాం నాయక్ పర్యటన ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండల అధ్యక్షురాలు పూనెం సరోజ, మహిళా సీనియర్ నాయకులు ఎండి షబానా, ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, డాకూరి సౌజన్య, బాడిస పార్వతి, సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, పింగళి మాధవరెడ్డి, చారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప జిల్లా, నవంబర్ 24(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తోపాటు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు... సిద్దవటం మండలం



టక్కోలు గ్రామానికి చెందిన బి. శివకుమార్ అను నాకు లింగం పల్లె గ్రామ 2ఎకరాలు డీకేటి పట్టా భూమిలో కరెంట్ కనెక్షన్ ఇప్పించవలసిందిగా కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు. సి.కె.దిన్నె మండలం ఊటూకూరు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి అను నాకు పక్షవాతం వచ్చిందనీ ఫించన్ మంజూరు చేయాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. జమ్మలమడుగు మండలం రాజీవ్ నగర్ కాలనికిచెందిన షేక్ మస్తాన్ బీ మా ఇంటి ముందు గోడ కట్టి కొందరు వ్యక్తి దౌర్జన్యం చేయుచున్నారనీ గోడ తొలగించి న్యాయం చేయగలరని కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష, రంగస్వామి,డి.ఆర్.డి.ఏ. పి.డి. జి. రాజ్యలక్ష్మి, ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి దండ్రులే పిల్లల్లో సంస్కార నిర్మాతలు

తల్లిదండ్రులే పిల్లలకు
మొదటి గురువులు
తల్లిధండ్రులే పిల్లల్లో
సంస్కార నిర్మాతలు

తల్లిదండ్రుల.ప్రవర్తనను
పరిశీలించి పిల్లలు
తమ ప్రవర్తనను
ఏర్పరుచుకుంటారు

తల్లి ధండ్రుల గుర్తింపే
పిల్లల గుర్తింపుకు ఆధారం

జన్మనిచ్చిన తల్లి మొదటి దైవం
విద్యాబుద్ధులు విజ్ఞానాన్ని
అందించి స్వశక్తిపై ఆధారపడేలా
చేసే తండ్రి రెండో దైవం

తల్లి తండ్రులే పిల్లల్లో
సభ్యత సంస్కారం
అంకితభావం నిజాయతీ
లక్ష్యసాధన కాంక్షను రేకెత్తిస్తారు

తల్లిదండ్రులు పిల్లల
ముందు చేయకూడని
పనులను దృష్టిలో
ఉంచుకొని ప్రవర్తించాలి

చీటికిమాటికి ఒకరిపై
ఒకరు గట్టిగా అరవకూడదు.
తరచుగాగొడవ పడరాదు
గొడవపడ్డతర్వాత అహంతో
ఇద్దరు అలిగి రోజుల తరబడి
మాట్లాడుకోకపోవడం
చేయకూడదు
తల్లిదండ్రుల మౌన వ్రతానికి
పిల్లల లేత మనసులు
కుంగుబాటు కు గురై
డిప్రెషన్ కు లోనవుతారు

పోద్దొస్తమానం టివి సీరియల్స్
సినిమాలు కంప్యూటర్ చూస్తూ
ఫోన్లోతో కాలం గడపడప వద్దు
మద్యపానం ధూమపానం
చేయవద్దు డ్రగ్స్ తీసుకోవద్దు

ఆరోగ్యకరమైన ఆహారాన్ని
భుజించడం మెరుగైన జీవనశైలి
మెరుగైన సామాజిక
సత్సంబంధాలు కలిగి ఉండాలి

తల్లిదండ్రులు పరస్పరం
ప్రోత్సహించుకోవడం
ముచ్చట్లు చెప్పుకోవడం
మనసారా నవ్వడం
ఆహ్లాదకర వాతావరణం
కుటుంబంలో నెలకొల్పాలి

పుస్తకాలను చదవడం
జాతీయ వార్తలు విశేషాల
పట్ల చర్చించడం వల్ల
పిల్లల్లో సామాజిక స్పృహ
పెరుగుతుంది

సృజనాత్మక రచనలు చేయడం
చరిత్రలో విజయాలు సాధించిన
మహానుభావుల గురించి
పిల్లలతో చర్చించాలి

క్రమం తప్పకుండా నడక
వ్యాయామం యోగా ధ్యానం
ఆరోగ్యకరమైన ఆహార
అలవాట్లను కలిగిఉండాలి
పిల్లలు వాటిని గమనించి
తల్లిదండ్రులను
అనుసరిస్తారు అప్పుడే
ఆరోగ్య కరమైన సమాజం
నిర్మాణం అవుతుంది

తల్లిదండ్రులు పిల్లల్లో
కరుణ దయ ధైర్యం
అనే విత్తనాలు నాటుతారు

ప్రేమ ఐక్యత కుటుంబ భలం
బలగం భంధుత్వ బంధాలను
పిల్లలకు పరిచయం చేసే
వారథులు తల్లితండ్రులే

తల్లితండ్రులే పిల్లల్లో ఉత్తమ
విలువలకు సద్గుణ సంపదకు
సన్మార్గానికి మార్గదర్శకులు

పిల్లల్లో నైతికత ధర్మభద్ధ జీవితం
సేవా దృకృథాన్నిపెంపొందిస్తారు

ఎంత ఎత్తు ఎదిగిన
ఢిల్లీకి రాజైన
తల్లితండ్రులకు కొడుకే నన్న
స్పృహను మరువద్దు

తల్లితండ్రులను పలకరించండి
ఆప్యాయత అనురాగంతో
తల్లితండ్రులను వృద్ధులను
ఆదరించండివృద్ధుల పట్ల
ప్రేమ కరుణ పాటించండి

తల్లిదండ్రులను ఆదరించండి
ప్రేమానురాగాలు పంచుతూ
సంస్కారవంతమైన
సమాజ నిర్మాణంలో
భాగస్వాములైజి

ప్రేమద్వారా కుటుంబాలను
శక్తివంతం చేద్దాం
అన్న నినాదం
జాతీయ సామాజిక
జీవన విధానం కావాలి

వసుధైక కుటుంబ నిర్మాతలైన
తల్లిదండ్రులను
గౌరవిద్దాం ఆదరిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం

మాజీ కరెస్పాండెంట్ జస్టిస్ కుమారయ్య
లా కాలేజీ
కరీంనగర్
కల్లేపల్లి( గ్రా) బెజ్జంకి ( మ)
సిద్ధిపేట జిల్లా
9440245771



# కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలులు విజిట్



కడప, నవంబర్ 24(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలుల సూపరిడెంట్ లు, ఇంచార్జ్ సూపరిడెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (భారత శక్తి): సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం కార్మిక శాఖకు సంబంధించిన, కార్మికుల ప్రమాద బీమా పెంపు సమాచార గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ EOW ఇన్స్పెక్టర్ జె. ఉపేంధర్‌కు కేంద్రీయ గృహ మంత్రి దక్షత పదక్ - 2025

%సైబరాబాద్, నవంబర్ 24(భారత శక్తి): సైబరాబాద్ EOW ఇన్స్పెక్టర్ జె. ఉపేంధర్‌కు కేంద్రీయ గృహ మంత్రి దక్షత పదక్ %-% 2025 తో సత్కరించారు. సోమవారం EOW ఇన్స్పెక్టర్ జె. ఉపేంధర్, EOW డీసీపీ ముత్యం రెడ్డితో కలిసి సైబరాబాద్ సిపి అవినాష్ మొహంతిని కలిశారు. జాతీయ స్థాయి గుర్తింపు పొందినందుకు సిపి ఆయనను అభినందించారు. భారతదేశ తొలి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (అక్టోబర్ 31) సందర్భంగా న్యూఢిల్లీలోని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక కేంద్రీయ గృహ మంత్రి దక్షత పదక్ - 2025 కు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఇన్స్పెక్టర్ జె. ఉపేంధర్ ఎంపికయ్యారు. ఈ అవార్డు హత్య దర్యాప్తులలో అతని అత్యుత్తమ ప్రతిభను గుర్తించింది, వాటిలో తొమ్మిది జీవిత ఖైదులను పొందడం, అతని అసాధారణ వృత్తి నైపుణ్యం, దర్యాప్తు నైపుణ్యం మరియు న్యాయాన్ని నిలబెట్టడంలో నిబద్ధతను ప్రతిబింబిస్తుందని సిపి అన్నారు



# సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి

## - ఫిర్యాదుదారుల నుండి ప్రత్యక్షంగా ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 24:



జిల్లా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు,జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి / గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విని, సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓ లతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాది సమస్యను ఓపీగా విని, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తూ.. బాధితులకు బాసటగా నిలవాలని ఎస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకనప్పుడు, మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Tender Notice No. CEEPSC-2x25kv PMS-01/2025-26-01. Dated : 24-11-2025** PUB/1479

భారత యూనియన్ అధ్యక్షుడి తరపున, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్ ఈ క్రింది పనులకు (ఆన్‌లైన్) ఇ-టెండర్లను ఆహ్వానిస్తోంది:

వరుస సంఖ్య: 1, టెండర్ నం.: CEEPSC-2x25kV-PMS-01, తేదీ.22.11.2025., పని వివరణ: ''సౌత్ సెంట్రల్ రైల్వే (SCR) పరిధిలోని చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ప్రాజెక్ట్స్/ సికింద్రాబాద్ పరిధిలోని వివిధ నిర్మాణ ప్రదేశాలు/విభాగాలలో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సేవలు (PMS) అందించడానికి అథారిటీ ఇంజనీర్ నియామకం కోసం ప్రతిపాదన (RFP) కోసం అభ్యర్థన''., సుమారు విలువ: రూ.25,62,45,250.00, ఎర్నెస్ట్ మనీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి: రూ.14,31,200.00, టెండర్ ఫారమ్ ధర రూ.లో: లేదు, పూర్తి వ్యవధి: 730 రోజులు (24 నెలలు), టెండర్ ప్రారంభ స్థలం: సికింద్రాబాద్.

ఈ-టెండర్ ద్వారా టెండర్ ముగింపు (ఆన్‌లైన్): సమయం: 15.00 గంటలు, తేదీ: 09.01.2026, ఈ-టెండర్ ద్వారా టెండర్ తెరవడం (ఆన్‌లైన్) సమయం: 16.00 గంటలు, తేదీ: 09.01.2026

టెండర్ తెరిచే తేదీ తరువాత సెలవు దినంగా ప్రకటించబడితే, తదుపరి పని దినం నిర్ణీత సమయంలో టెండర్లు తెరవబడతాయి.

మరిన్ని టెండర్ నిబంధనలు/వివరాల కోసం మరియు టెండర్ల సమర్పణ కోసం, దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.inని సందర్శించండి.

గమనిక: టెండర్ పత్రాలు/దిద్దుబాటు/అనుబంధంలో ఏవైనా మార్పులు అవసరమైతే పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.

**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్**

**NOTICE INVITING e-TENDER (through http://ireps.gov.in)** PUB/1480

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేలోని చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం) భారత రాష్ట్రపతి ఆదేశం మేరకు రెండు ప్యాకెట్ టెండరింగ్ పద్ధతిలో ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

వరుస సంఖ్య: 1, NIT నం.: టెండర్ నం. 04-2025-2026-B-252-TRD, పని పేరు: ''డిజైన్, సరఫరా, నిర్మాణం, యొక్క పరీక్ష మరియు కమీషన్ 25KV, 50HZ, సింగిల్ ఫేజ్ AC తో ట్రాక్షన్ ఓవర్హెడ్ పరికరాలు 65 65sq.mm మిమీ క్యాటరనరీ వైర్ మరియు 107 107sq.mm HDG రాగి కాంటాక్ట్ వైర్, LT సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ మార్పులతో సహా స్టేషన్లు ఇప్పటికే ఉన్న OHE కి సంబంధించి ROR తో ప్రతిపాదిత బై పాస్ లైన్ ముస్తాబాదా (MBD) మరియు మధ్య రాయనపాడు (RYP) - (బ్యాలెన్స్ విజయవాడ డివిజన్‌లోని (పనులు) దక్షిణ - మధ్య రైల్వే'', వివరాలు: అంచనా వ్యయం: రూ. 1,91,06,294.00, EMD: రూ. 2,45,500, టెండర్ డాక్యుమెంట్ ధర: లేదు, పూర్తి కాలం: 12 నెలలు, ముగింపు తేదీ : 15.12.2025 మధ్యాహ్నం 3 గంటలకు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వండి.

2. బిడ్ సెక్యూరిటీ/EMD ని IREPS లో ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా నగదు రూపంలో డిపాజిట్ చేయాలి లేదా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి FA&CAO/C/SC కి బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా లేదా టెండర్ డాక్యుమెంట్లలో పేర్కొన్న విధంగా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనుబంధం-VIA ప్రకారం ఉంటుంది మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి తర్వాత 90 రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది.

3. టెండరుదారులు తమ ఆఫర్లను టెండర్ సమర్పణ వ్యవధిలో, అంటే టెండర్ ముగింపుకు పదిహేను రోజుల వ్యవధిలో ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.

4. టెండరు దాఖలు చేసే సమయం ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడినది) కోసం గమనించాలి.

**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), సికింద్రాబాద్**

**NOTICE INVITING e-TENDER (through http://ireps.gov.in)** PUB/1481

సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో కింది పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ సిఇఇ/జిఎస్/ఎస్సి, సికింద్రాబాద్ ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

వరుస సంఖ్య:1, NIT నం.: CE-29-GSU-ELEC-03-2025-26, పని పేరు: టెండర్ నం. CE-29-GSU-ELEC-03-2025-26 తేదీ.21.11.25. 1) SC డివిజన్‌లోని ఓపెన్ లైన్‌లోని చిత్తాపూర్ వద్ద సరుకు రవాణా వ్యాగన్ నిర్వహణ సౌకర్యాలు మరియు విపత్తు నిర్వహణ రోలింగ్ స్టాక్ నిర్వహణ సౌకర్యాల స్థాయి/పెంపునకు OHE అమరిక. 2) చిత్తాపూర్-SC డివిజన్‌లోని చిత్తాపూర్ వద్ద WADI చివర వైపు షంటింగ్ నెక్ ఏర్పాటు-OHE ఏర్పాట్లు, వివరాలు: టెండర్ ఖర్చు:-రూ.3,56,68,186.10, పూర్తి వ్యవధి: 9 నెలలు, ముగింపు తేదీ: 15.12.2025 మధ్యాహ్నం 3:00 గంటలకు

టెండర్ షరతులు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్‌లోని ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి, వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉంటే చూడవచ్చు. టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కోసం గమనించాలి.

**Dy. చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/గతి శక్తి/ సికింద్రాబాద్**

**Tender Notice No. G/E.29/Tr./Tender Notice/32/2025-26, Dated : 24-11-2025** PUB/1482

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం. GTL-TRD-29-eTN-60-2025-26, పని పేరు: గుంతకల్ డివిజన్ - YA/SP చివరన తక్కువ వోల్టేజ్‌ను తగ్గించడానికి జమ్మలమడుగు/SSPని SPగా మార్చడం, సుమారు విలువ: రూ.1,37,51,636.00, EMD: రూ.2,18,800.00

టెండర్ ముగింపు తేదీ & సమయం: 16.12.2025 మధ్యాహ్నం 3:00 గంటలకు.

టెండర్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలను www.ireps. gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా దిద్దుబాటు పత్రం ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, /ట్రాక్షన్/గుంతకల్లు**

**Tender Notice No. 108 to 110_ DRM_W_HYB_25, Dated : 20-11-2025** PUB/1483

భారత రాష్ట్రపతి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ 15/12/2025 సాయంత్రం 3.00 గంటల వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం.: 108_DRM_W_HYB_25, పని పేరు: సికింద్రాబాద్-ధోన్ విభాగం: టింబుల్ గెడో వోర్సిన్ సిస్టమ్‌ని ఉపయోగించి ట్యాంపింగ్‌కు ముందు మరియు తర్వాత ట్రాక్ కొలత సర్వే. ((1) CTR(P)-25.93 & TRR(P) 0.80Kms పనిలో భాగం మరియు (2) CTR(P)-21 & TRR(P)-1.7Kms), సుమారు విలువ (రూ.): 1,13,53,162.00, EMD(రూ.): 2,06,800.00

టెండర్ నం.: 109_DRM_W_HYB_25, పని పేరు: HYB డివిజన్:- బాసర్-గోదావరి పుష్కరం-2027 సందర్భంగా కొత్త హోల్డింగ్ ప్రాంతం అభివృద్ధిలో భాగంగా ప్లాట్‌ఫారమ్ నంబర్ 4, షెల్టర్ (COP), రిటైనింగ్ వాల్ మరియు exg FOBని PF 4కి పొడిగింపు PF గోడ మరియు వేచి ఉండే ప్రాంతంతో సహా పని A ముగింపు ప్లాట్‌ఫారమ్ (పూర్తి పొడవు 560X10M) పని B షెల్టర్ FPR 50X10మీ-R 250 చదరపు మీటర్లు) పని C రిటైనింగ్ వాల్ (550M) కేటాయింపు'', సుమారు విలువ (రూ.): 9,58,86,258.00, EMD (రూ.): 6,29,400.00

టెండర్ నం.: 110_DRM_W_HYB_25, పని పేరు: హైదరాబాద్ డివిజన్: HYB డివిజన్‌లోని 8 హాల్ట్ స్టేషన్లలో (HG-2/3) దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు మరియు 5 SG-3 స్టేషన్లలో టాయిలెట్ల అప్‌గ్రేడేషన్ (ప్రాజెక్ట్ ID 11.03.53.25.3.52.009లో భాగంగా SC-MUEలో అమలు చేయాల్సిన పని), సుమారు విలువ (రూ.): 2,01,17,064.00, EMD(రూ.): 2,50,600.00

మరిన్ని వివరాలకు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను దర్శించండి.

**సీనియర్ డెన్/కో-ఆర్డర్/హైదరాబాద్**

**Tender Notice No. 111_ DRM_ W_HYB_25, Dated : 21-11-2025** PUB/1484

భారత రాష్ట్రపతి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ 17/12/2025 సాయంత్రం 3.00 గంటల వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం.: 111_DRM_W_HYB_25, పని పేరు: హైదరాబాద్ డివిజన్: 8 హాల్ట్ స్టేషన్లలో (HG-2/3) దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు మరియు HYB డివిజన్‌లోని 7 SG-3 స్టేషన్లలో టాయిలెట్ల అప్‌గ్రేడేషన్ (ప్రాజెక్ట్ ID 11.03.53.25.3.52.009లో భాగంగా SC-DHNEలో అమలు చేయాల్సిన పని), సుమారు విలువ (రూ.): 2,01,04,219.00, EMD(రూ.): 2,50,500.00

మరిన్ని వివరాలకు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

**సీనియర్ డెన్/కో-ఆర్డర్/హైదరాబాద్**

A1877

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

# మన్యం కాఫీకి భలే భలే డిమాండ్

విశాఖపట్టణం, నవంబర్ 24,

మన్యం కాఫీకి అంతర్జాతీయంగా పేరున్న విషయం తెలిసిందే. కానీ రైతులకు సరైన ధర దక్కడం లేదని ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాఫీ కొనుగోలు ధరలను పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది మన్యం ఐటీడీఏ సంస్థ. ఈ మేరకు కాఫీ రకాన్ని బట్టి కిలోకి రూ. 10 నుంచి రూ. 50 మధ్యలో పెంచారు. అంతేకాకుండా ఇంటి వద్దే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక కాఫీ సేకరించిన డబ్బులను రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతంలో పండే కాఫీ.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందింది. కాఫీ సాగుకు అనుకూలమైన చల్లని వాతావరణం ఉండటంతో.. మన్యం ప్రాంతంలో కాఫీ సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో.. దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడి కాఫీ రైతులు ఏటా సుమారు 17 వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను విక్రయిస్తారు. అయితే కాఫీ గింజల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంటకు సరైన ధర రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాఫీ రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2025-26 ఈ ఆర్థిక సంవత్సరానికి కాఫీ కొనుగోలు ధరల్ని పెంచినట్లు గిరిజన సహకార సంస్థ (ఐటీడీఏ) ప్రకటించింది. ఈ మేరకు బుధవారం (నవంబర్ 19) విశాఖలో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ కాఫీ ధరల్ని దృష్టిలో ఉంచుకుని ధరలను పెంచారు.కాఫీ రకాన్ని బట్టి కొనుగోలు ధరలను పెంచింది గిరిజన సహకార సంస్థ. అందులో భాగంగా కిలోకి రూ. 10 నుంచి రూ. 50 వరకు పెంచారు. కిలో అరెబికా పార్చ్‌మెంట్



కాఫీ రకంపై.. రూ. 450 పెంచారు. ఇక అరెబికా చెర్రీకి రూ. 270, రోబస్టా చెర్రీకి రూ. 170 పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా కాఫీ సేకరణకు ఏజెన్సీలో ఉన్న మారుమూల ప్రాంతాలకూ తమ సిబ్బంది వెళ్తారని జీసీసీ ఎండీ కల్పన కుమారి వెల్లడించడం గమనార్హం.కాఫీ రైతుల ఇంటి వద్దే ఎలక్ట్రానిక్ కాంటాతో కచ్చితమైన తూకంతో పంటను సేకరిస్తామని వివరించారు. అంతేకాకుండా కాఫీ కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు.. రైతు బ్యాంకు ఖాతాల్లో 24 గంటల్లో జమ చేస్తామని తెలిపారు. కాగా, తాము ప్రకటించిన ధరల కంటే తక్కువకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు కల్పన కుమారి కోరారు. ఈ మేరకు పెంచిన ధరలపై గిరిజన రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఇంతకుముందు రైతులు తమ కాఫీ పంటను అమ్మాలంటే.. అరకు, పాడేరు ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటి వద్దే సేకరిస్తే.. రైతులకు వ్యయప్రయాసల నుంచి ఉపశమనం లభిస్తుంది.నాణ్యతలో మేటిగా ఉన్న మన్యం కాఫీ గింజలకు బెంగళూరు కాఫీ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గత సంవత్సరం మన్యం నుంచి పంపిన కాఫీ పాచ్‌మెంట్ గింజలకు.. కిలో రూ. 500 ధరతో వ్యాపారం జరిగినట్లు సమాచారం.

# గోదావరి జిల్లాలపైనే దృష్టంతా

కాకినాడ, నవంబర్ 24,

జనసేన బలోపేతంపై దృష్టి పెట్టారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలం పెంచుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా కొన్ని ఎంపిక చేసుకున్న జిల్లాల్లో పార్టీని మరింత విస్తృతం చేయాలని చూస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. సుదీర్ఘ పోరాటం తర్వాత ఏపీలో అధికారంలోకి రాగలిగారు. కూటమిలో కీలక భాగస్వామిగా మారారు. అయితే ఇప్పుడే బలపడేందుకు సరైన సమయం అని భావించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి కమిటీ నుంచి జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే గత ఏడాది అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రస్థాయి కమిటీని ప్రకటించారు. అయితే ఈసారి గ్రామ కమిటీలను సైతం ఏర్పాటు చేస్తుండడం విశేషం. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పవన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గడిచిన ఎన్నికల్లో 100 స్ట్రైక్ రేట్ తో జనసేన విజయం సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. నామినేటెడ్ పదవుల్లో సైతం ప్రాతినిధ్యం తగ్గించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సత్తా చాటాలని చూస్తోంది. అందుకే గ్రామ, మండల కమిటీలకు ప్రాధాన్యమిస్తోంది. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయ బృందం వివిధ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, వీర మహిళలకు సమావేశాలు నిర్వహించింది. క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, సూచనలను స్వీకరించింది. ఈ డేటాను ఆధారంగా చేసుకుని కమిటీల కూర్పును రూపొందిస్తున్నారు. దిగువ స్థాయి కార్యకర్తల మనోభావాలను సైతం తెలుసుకునే ప్రయత్నం చేశారు.ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖలో



జనసేనకు ప్రాతినిధ్యం ఉంది. అందుకే ఈసారి రాయలసీమతో పాటు కోస్తా జిల్లాలపై దృష్టి పెట్టాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ప్రధానంగా ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అక్కడి నాయకత్వాన్ని మరింత పటిష్టం చేసి కార్యక్రమాలను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణుల సహాయం తీసుకోవడమే కాదు.. పార్టీ బలాన్ని విస్తరించడం పై దృష్టి పట్టాలని నిర్ణయించారు. మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పడితే ప్రజల సమస్యలను త్వరగా స్పందించవచ్చని.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే జనసైనికులు జోష్ నింపే వార్త చెప్పారు పవన్ కళ్యాణ్. ఇప్పటివరకు జనసేనకు గ్రామస్థాయిలో కమిటీలు లేవు. అయితే ఈ కమిటీల ద్వారా స్థానిక సంస్థల్లో కొన్ని పదవులు దక్కించుకోవాలన్నది పవన్ ప్లాన్.

=============

# నవంబర్‌లోనే మామిడి

## జనవరిలోనే తాటి ముంజులు





విజయవాడ, నవంబర్ 24,

ఇదేం విచిత్రం.. నవంబర్‌లోనే మామిడి కాయలా.. మార్చిలో రావాల్సినవి ఇప్పుడు దొరుకుతున్నాయంటే నమ్మశక్యంగా లేదు కదూ.. నూజివీడు రసాల కోసం విజయవాడ నుంచి కూడా వ్యాపారులు వస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాతావరణంలో మార్పుల వల్లే ఇలా జరుగుతోందని అంటున్నారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా తాటి ముంజలు, మామిడి కాయలు సీజన్‌కు ముందే అందుబాటులోకి రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గతేడాది కూడా మామిడి, తాటి ముంజలు ముందుగానే వచ్చాయి.

విచిత్రంగా మామిడి కాయలు నవంబర్ నెలలోనే అందుబాటులోకి వచ్చాయి. వాస్తవానికి మార్చి నెలలో మామిడి పంట దిగుబడి వస్తుంది. కానీ నూజివీడు మామిడి పండ్లు ఈ ఏడాది మార్చికి బదులుగా నవంబర్‌లోనే అందుబాటులోకి వచ్చాయి. ఆగిరిపల్లి, వడ్లమాను ప్రాంతాల్లోని కొందరు రైతుల దగ్గర ఈ మామిడి కాయలు దొరకడంతో జనాలు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది వివాహాలు, విందుల్లో ప్రత్యేక వంటకాల కోసం ఈ మామిడిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం కొద్దిమంది రైతుల దగ్గర మాత్రమే ఈ కాయలు ఉండటంతో, ఉమ్మడి జిల్లాలోని చాలామంది కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ నుంచి కూడా వ్యాపారులు నూజివీడు రసాల కోసం వస్తున్నారు.ఆగిరిపల్లికి చెందిన గుండుబోగుల వెంకట రమేశ్ తన స్నేహితుడి కుమారుడి పెళ్లి కోసం మామిడి కాయలు కొనుగోలు చేశారు. 82 కిలోల మామిడిని కిలో రూ.150 చొప్పున కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో ఇదే మామిడి కిలో రూ.10-15కే వస్తుంది. ఈ ఏడాది మామిడి సీజన్ ముందుగానే ప్రారంభం కావడం ఆశ్చర్యంగా ఉంది. వాతావరణంలో మార్పుల వల్ల ఇలా జరిగి ఉండవచ్చు అంటున్నారు. గతేడాది కూడా డిసెంబర్ నెలలోనే మామిడి పండ్లు, తాటి ముంజలు అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా మామిడి పండ్లు, తాటి ముంజలు అందుబాటులోకి వచ్చాయి.ఇటీవల విశాఖపట్నంలో తాటి ముంజలు జనాలకు అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఎండాకాలంలో అది కూడా మార్చి తర్వాత దొరికే తాటికాయలు నాలుగైదు నెలల ముందే జనాలకు అందుబాటులోకి వచ్చాయి. నగర శివారు ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభం ప్రాంతాల నుంచి ఈ తాటికాయల్ని తీసుకొచ్చి.. విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులోని సీతకొండ దగ్గర తాజాగా విక్రయించారు. జనాలు డజను తాటి ముంజలు రూ.100 చొప్పున కొనుగోలు చేశారు. గతేడాది విజయవాడలో డిసెంబర్ నెలలోనే మామిడి పండ్లు, తాటి ముంజలు విక్రయించారు. ఈ ఏడాది కూడా విజయవాడ, విశాఖపట్నంలో సేమ్ టు సేమ్ అదే పరిస్థితి మళ్లీ రిపీట్ అయ్యింది.

# అమరావతి విజన్ 2047.. మీరు ఆలోచన చేయవచ్చు

విజయవాడ, నవంబర్ 24,



ఏపీ రాజధాని అమరావతి రాజధాని ప్రాంతానికి 'విజన్ 2047' రూపకల్పనపై సీఆర్‌డీఏ కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఏపీ సిఆర్డిఏ ప్రజల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తోంది. దీని కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ 'విజన్ 2047' రూపకల్పనలో భాగంగా సర్వేను నిర్వహిస్తోంది. భవిష్యత్తు తరాలకు ఉత్తమ, సుస్థిరమైన, ఆధునిక మౌలికవసతులతో కూడిన రాజధాని ప్రాంతంగా అమరావతిని అభివృద్ధి చేయేందుకు ప్రజల అభిప్రాయాలు, సూచనలు సిఆర్డిఏకు దిశానిర్దేశం చేస్తాయని పేర్కొంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతం మొత్తంగా 8,600 చదరపు కిలోమీటర్ల పైగా విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రాంతంలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాలకు చెందిన 56 మండలాలు, 900కు పైగా గ్రామాలతో పాటు విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి, తాడేపల్లి వంటి నగరాలు ఉన్నాయి.అమరావతి 'విజన్ 2047' తయారీ ప్రక్రియలో భాగంగా ప్రజలు, ప్రజాసంఘాలు, నిపుణులు, వివిధ వర్గాలలోని విషయ నిపుణుల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను ఏపీ సిఆర్డిఏ సేకరిస్తోంది. ఈ సర్వేను ఇంగ్లీష్ ఉ తెలుగులో పూర్తి చేసుకునే అవకాశం కల్పించింది. ఇక్కడ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా, కింద ఇచ్చిన లింక్ క్లిక్ చేయడం ద్వారా లేదా సిఆర్డిఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సర్వేలో పాల్గొని మీ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. సర్వేలో అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పంపడానికి చివరి తేదీ 30 నవంబర్.ఏపీ రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధిని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు, భవిష్యత్తు తరాలకు అత్యుత్తమ రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు, ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొనాలని ఏపీ సిఆర్డిఏ విజ్ఞప్తి చేసింది.

# అమెరికాలో భారత వస్తువులపై పడని ఎఫెక్ట్


న్యూఢిల్లీ, నవంబర్ 24

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. తన 2.0 పాలనలో భారత్‌ను పూర్తిగా శత్రుదేశంగా పరిగణిస్తున్నాడు. ఆయన చెప్పినట్లుగా వినాలని హుకూం జారీ చేస్తున్నాడు. వినలేదన్న కోపంతో భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే భారత ఎగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. దీంతో అమెరికాలో భారతీయ వస్తువులకు డిమాండ్ తగ్గుతుందని భావించాడు. కానీ, ట్రంప్‌ను అమెరికన్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. మన వస్తువులనే అమెరికన్లు ఎక్కువగా నమ్ముతున్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా మన వస్తువుల ధరలు పెరిగినా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారుభారత్‌ను దెబ్బతీయాలని ట్రంప్ భావిస్తుంటే.. అమెరికన్లు మాత్రం మన సరుకులనే ఆదరిస్తున్నారు. భారతీయ వస్తువులే కావాలని వ్యాపారులను ఒత్తిడి చేస్తున్నారు. దీంతో టారిఫ్‌ల కారణంగా దిగుమతులు తగ్గించిన వ్యాపారులు కూడా క్రమంగా మన సరుకుల దిగుమతి పెంచుతున్నారు. ఇక భారతీ వర్కర్ల స్థానంలో అమెరికన్లను నియమించుకోవాలని ట్రంప్ ఆదేశించారు. కానీ ట్రంప్ ఆదేశాలను పాటించడం లేదు. అమెరికా వర్కర్లను పెట్టుకుంటే వేతనం ఎక్కువ ఇవ్వడంతోపాటు వారు పని చేయడానికి ఇష్టపడరు. అందుకే వ్యాపారుల థర్డ్ పార్టీ విధానం ఎంచుకుని ట్రంప్‌కు షాక్ ఇచ్చారు.ఇక భారతీయ వస్తువులకు అమెరికాలో ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. దీంతో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయి.

తాజాగా 50 శాతం టారిఫ్‌ల అమలవుతున్నా.. గడిచిన అక్టోబర్‌లో మన ఎగుమతులు 14 శాతం పెరిగాయి. మన సరుకులపై నమ్మకం, డిమాండ్‌కు ఇదే నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మన సరుకుల విషయంలో ట్రంప్ చేసిన పొరపాటు కారణంగానే ఇప్పుడు అక్కడ ధరలు పెరిగాయన్న భావన అమెరికాల్లోలో నెలకొంది. ఈ పరిస్థితి ట్రంప్ చేసిన విధానంలో ఒక వ్యతిరేక ఫలితాన్ని చూపిస్తోంది. భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు వృద్ధి చేస్తూనే, ఆ దేశంలో వస్తువుల అందరికీ కొరత కారణంగా ధరలు పెరుగుతున్నాయి

# కశ్మీర్‌ను జల్లెడ పట్టేస్తున్నారు...

శ్రీనగర్, నవంబర్ 24,



ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటన తర్వాత విచారణతోపాటు సోదాలు ముమ్మరమయ్యాయి. ఉగ్రవాదుల గుర్తింపు, ఏరివేత కోసం తనిఖీలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఉగ్ర లింకులు, ఇంటలిజెన్స్ నివేదిక ఆధారంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఫరీదాబాద్, హన్యాణాలోని నూహూ, మేవాట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తనిఖీలు జరుగుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోనూ ఉగ్రవేట కొనసాగుతోంది. అనుమానితులను అరెస్ట్ చేస్తున్నారు. వైనర్లు కూడా ఉగ్రవాదులతో సంబంధాలు కొనసాగిస్తున్నాట్లు గుర్తించారు.ఢిల్లీ ఉగ్ర ఘటనతో సంబంధం ఉన్న జమ్మూ కశ్మీర్‌కు చెందిన డాక్టర్ అదిల్, డాక్టర్ ముజమిల్ డాక్టర్ నబీ స్వగ్రామం నౌగాంలోని తనిఖీల్లో నీర్యా అడవుల్లో చాలా పెద్ద ఎత్తున ఆయుధాలు, గ్రెనేడ్లు, బాంబులు, మిగతా ఐఈడీలు దొరికాయి. వీటిని దాచిపెట్టిన షానవాజ్‌ఖాన్ అబ్దుల్ లతీఫ్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో ఇంకా సోదాలు జరుగుతున్నాయి. ఉగ్రవాద లింకులు ముఖ్యంగా వైట్ కోర్ట్ ఉగ్రవాదానికి సంబంధించిన అన్ని లింకులను కూలంకశంగా వెతుకుతున్నారు. వాటిని ఏరిపారేసే పని చేస్తున్నారు.తనిఖీల్లో ముఖ్యంగా వైట్‌కోర్ట్ ఉగ్రవాదంపై పోలీసులు, ఎన్ఐఏ అధికారులు, ఇంటలిజెన్స్ అధికారులు దృష్టిసారించారు. ఉగ్ర కుట్రలను అడ్డుకోవడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఉగ్ర లింకులను తెంపేస్తున్నారు. ఈ చర్యల ద్వారా టీఏటీపీ, అమ్మోనియం నైట్రేట్ వంటి ప్రమాదకర బాంబు పదార్థాలు, ఆయుధాలు సేకరించి తీవ్రత తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. ఉగ్రవాదులు ఎలా, ఎక్కడ దాడులకు పాల్పడుతున్నారో సంస్థలు జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# పాకిస్తానీయుల చేతుల్లో బ్రిటన్ నగరాలు..

న్యూఢిల్లీ, నవంబర్ 24

బ్రిటన్.. 200 ఏళ్లు భారత్‌ను పాలించింది. మన వనరులు, సంపద మొత్తం దోచుకుపోయింది. అఖండ భారత దేశాన్ని ముక్కలు చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌ను, బర్మాను మన నుంచి స్వాతంత్ర్యానికి ముందే విడగొట్టింది. ఇక స్వాతంత్రం వచ్చాక పాకిస్తాన్ విడిపోయింది. బ్రిటన్ విభజించి పాలించు సిద్ధాంతం కారణంగా అఖండ భారతంలో ముస్లింలు ఒక్కటై ప్రత్యేక దేశం పాకిస్తాన్‌గా విడిపోయారు. అయితే ఇంత చేసిన బ్రిటన్.. ఒకప్పుడు ప్రపంచంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉండేది. కానీ ఇప్పుడు క్రమంగా దాని స్థానం దిగజారుతోంది. మరోవైపు బ్రిటన్‌లో స్థానికులకన్నా.. స్థానికేతరులు పెరుగుతున్నారు. ముఖ్యంగా ముస్లిం జనాభా గణనీయంగా పెరుగుతోంది.బ్రిటన్‌లోని 11 నగరాల్లో ముస్లిం జనాభా గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి ఉపాధి నిమిత్తం వెళ్లి స్థిరపడినవారు కొందరు అయితే.. తమ వారు ఉన్నారని అక్రమంగా వెళ్లినవారు ఎక్కువ మంది ఉన్నారు. దీంతో క్రమంగా ఈ నగరాల్లో ముస్లిం జనాభా భారీగా పెరిగింది. ఈ నగరాల్లో ఇప్పుడు స్థానికేలే ద్వితీయ పౌరులుగా జీవిస్తున్నారు. స్థానికులు ఏమైనా అంటే వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తారు.ఈ 11 నగరాలే కాకుండా ఇతర ముస్లిం దేశాల నుంచి కూడా వేల మంది బ్రిటన్‌కు వెళ్తున్నారు. అక్కడే స్థిరపడుతున్నారు. దీంతో మరి కొన్ని నగరాల్లో కూడా ముస్లిం జనాభా పెరుగుతోంది. పాకిస్తాన్‌తోపాటు, పాకిస్తానేతర ముస్లింలు ఒక్కటై బ్రిటన్‌లో విస్తరిస్తున్నారు. దీంతో అక్కడ స్థానిక పాలన పగ్గాలు కూడా ముస్లింలు చేపడుతున్నారు. దీంతో స్థానిక సంస్కృతి దెబ్బతింటోందని బ్రిటన్ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమకు పాత బ్రిటన్ కావాలని పోరాటం కూడా చేస్తున్నారు.ముస్లిం జనాభా పెరుగుదలను బ్రినట్ పాలకులు ఇప్పటి నుంచే అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ముందుగా అక్రమ వలసదారులను పంపించి వేయాలి. తర్వాత జనాభా నియంత్రణ చర్యలు చేపట్టాలి. స్థానిక సంస్కృతిని దెబ్బతీస్తున్నవారిపై కఠినంగా వ్యవహరించాలి. లేదంటే 2050 నాటికి ముస్లిం జనాభా గణనీయంగా పెరిగి చివరకు బ్రిటిష్ పాలనా పగ్గాలు కూడా ముస్లింల చేతికి వెళ్లే ప్రమాదం ఉంది.

# మేయర్ పై అవిశ్వాసం...

నెల్లూరు, నవంబర్ 24,

ఏపీలో వైసీపీకి మరో షాక్ తగిలింది. వైసీపీ నేత, నెల్లూరు మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఆ దిశగా టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. మేయర్ స్రవంతి అవినీతికి పాల్పడుతున్నారని.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ 40 మంది కార్పొరేటర్లు మంత్రి నారాయణను కలిసి ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. తీర్మానంపై ఇప్పటికే కార్పొరేటర్లు సంతకాలు చేశారని.. సోమవారం ఎన్నికల అధికారి చేతికి అందించనున్నట్లు తెలిసింది.ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలేలా కనిపిస్తోంది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు నేతలు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరిపోయారు. మరికొంతమంది రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. ఇక వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సహా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు.. కండువాలు మార్చేశారు. దీంతో పలుచోట్ల వైసీపీ మేయర్ పీఠాలను, మున్సిపల్ ఛైర్మన్ పదవులను కోల్పోవాల్సి వచ్చింది. ఆ జాబితాలోకి నెల్లూరు కూడా చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి తీరును తప్పుబడుతూ.. జిల్లాకు చెందిన మంత్రి పొంగూరు నారాయణను 40 మంది కార్పొరేటర్లు కలవడం ఇప్పుడు జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశమైంది.మంత్రి నారాయణను కలిసిన కార్పొరేటర్లు మేయర్ తీరుపై ఆయనకు ఫిర్యాదు చేశారు. మేయర్ స్రవంతి దంపతులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. మేయర్ దంపతులు అవినీతికి పాల్పడుతున్నారని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోందని మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. నెల్లూరుకు కొత్త మేయర్ కావాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కార్పొరేటర్ల వాదనతో మంత్రి నారాయణతో పాటుగా టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా ఏకీభవించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే ఆలోచనలో టీడీపీ ఉన్నట్లు




తెలుస్తోంది. తీర్మానంపై కార్పొరేటర్లు సంతకాలు చేశారని.. త్వరలో ఎన్నికల అధికారికి ఇవ్వనున్నట్లు సమాచారం.మరోవైపు నెల్లూరు కార్పొరేషన్‌లో మొత్తం 56 డివిజన్లు ఉన్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో 56 కార్పొరేటర్ పదవులను వైసీపీ గెలుచుకుంది. అయితే ఆ తర్వాత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో 29 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరిపోయారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ సహా చాలా మంది కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. అయితే మేయర్ స్రవంతి వైసీపీ కావటంతో.. సాంకేతికంగా మేయర్ పీఠం వైసీపీ ఖాతాలో ఉంది. తాజాగా 40 మంది కార్పొరేటర్లు ఆమెకు వ్యతిరేకంగా గళం విప్పటంతో.. మేయర్ పీఠం వైసీపీ చేజారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గ్రామీణ ఒగ్గు కథకు అంతర్జాతీయు కీర్తిని ఆర్జించి పెట్టిన జానపద వైతాళికుడు మిద్దె రాములు

## నేడు ఒగ్గు కథ పితామహుడు మిద్దె రాములు వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



ఒగ్గు కథ అంటే మిద్దె రాములు.. మిద్దె రాములు అంటేనే ఒగ్గు కథ. ఆయున గజ్జె కట్టి ఆడితే యూవత్ తెలంగాణ ఉద్రూతలూగింది. ఆ పల్లెపదాల పాటగాడి గొంతు గట్లమీదుగా సాగి పంట పొలాలను స్పృశించేది. తంగేడు పూలు తలలూపుతూ స్వాగతం పలికితే... పల్లెలు, తండాలు పరవశించిపోయేవి. ఒగ్గుకథ మూలవాసంగా నిలిచిన 'మిద్దె' నేటితరం కళాకారులకు చరిత్రగా మిగిలారు. అక్షరజ్ఞానం లేకున్నా.. ఆశుకవిగా ఆయన తరతరాలకు చెరగని సాంస్కృతిక సంపదగా నిలిచిపోయారు. గ్రామీణ ఒగ్గు కథకు అంతర్జాతీయు కీర్తిని ఆర్జిం చి పెట్టిన జానపద వైతాళికుడు ఆయున. బాల్యం నుంచే పాట...రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజీపేటకు చెందిన మిద్దె రాములు గొల్ల-కుర్మ కులస్తుడు కాకపోయినా ఒగ్గుకథకు అంకితమయ్యారు. ఒగ్గుకథకు పితామహుడిగా మన్ననలు పొందారు. నేటితరం కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారు. 1942లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజిపేట గ్రామంలో జన్మించిన మిద్దె రాములు ఐదుగురు సోదరుల్లో చిన్నవాడు. చిన్ననాటి నుంచే ఒగ్గుకథపై మమకారం పెంచుకున్న మిద్దెరాములు స్వయంకృషితో ఒగ్గుకథను ఆకళింపు చేసుకున్నారు. ప్రదర్శనలు ఇవ్వటం మొదలుపెట్టారు. గీతకార్మిక కుటుంబంలో పుట్టిన రాములు ప్రపంచవ్యాప్తంగా ఒగ్గుకథ ప్రదర్శనలిచ్చి తన ప్రతిభను చాటుకున్నారు.50 ఏండ్లుగా ఒగ్గుకథ ప్రయాణంతెలంగాణ వాడుకభాషలో 50 ఏండ్లుగా ఒకే బృందంతో డోలు, తాళం, జగ్గు, కంజర వాయిద్యాలు మోగింపజేస్తూ ఎల్లమ్మకథ, బాలనాగమ్మకథ, దేశింగురాజు కథ, సారంగధరకథ, గంగగౌరీ, ఐదు మల్లెపూల కథలను ఒగ్గుకథలుగా చెప్పారు మిద్దె రాములు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఇక్కడి ప్రజల భాషతో సాగే ఈ కథల మధ్యలో జానపద గేయాల్ని ఆలపిస్తూ, హాస్య వ్యంగ్యోక్తులు వేస్తూ కథను రసవత్తంగా రక్తికట్టించడం రాములు అలవర్చుకున్న కళ. నిరక్షరాస్యుడైన రాములుకు తెలంగాణ భాష, పౌరాణిక గాథలపై మంచి పట్టుండేది. ప్రాచీన పురాణాలు, చారిత్రక గాథలే కాకుండా తన కథ ద్వారా సామాజిక చైతన్యాన్ని రేకెత్తించే విధంగా కథలు చెప్పడం మిద్దెరాములు ప్రత్యేకత. తెలంగాణ ఉద్యమం లో బోనం నృత్యంతో ఉద్రుతలూగించారు. అపురూపం బోనం నాట్యంతెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు నిలువెత్తు నిదర్శనం గ్రామదేవతలకు సమర్పించే బోనం. నెత్తిన బోనమెత్తుకుని వడివడిగా నడువగలడం నేర్పుతో కూడిన ఘట్టం. ఈ పక్రియను తన జానపద కళారూపంగా మలుచుకున్నారు మిద్దె రాములు. ఒగ్గుకథ శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేస్తూ ఆయన అలవోకగా బోనం ప్రదర్శన ఇచ్చేవారు. నెత్తిన ఎత్తిన బోనంపై నిలిపిన జ్యోతి ఆరకుండా బోనంతో సహా నేలపై పడుకుని రూపాయి నాణాన్ని నోటితో తీసే ఘట్టం ప్రేక్షకులను తన్మయత్వానికి గురిచేసేది. అలాగే బోనం తలపైన పెట్టుకోని నృత్యం చేయడం, ఎగురుతూ పొర్లుదండాలు చేసే ఘటన చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. హైదరాబాద్ భాగమతి మైదానంలో జరిగిన తెలంగాణ ఉద్యమ సభలో మిద్దెరాములు ఎత్తిన బోనం ధూంధాం వేదికను ఉద్రూతలూగించింది. ఉద్యమ కెరటమై నిలిచింది. 1990లో మారిషస్‌లో జరిగిన తెలుగు మహాసభల్లో ఆయన ఒగ్గుకథ వినిపించారు. 2010 నవంబర్ 25న ఆయన కన్నుమూశారు. ఒగ్గుకథ ఉన్నంతకాలం ఆయన పేరు ఉంటుందనడంలో సందేహం లేదు.=

====

# కవిత వ్యూహం ఏమిటీ



హైదరాబాద్, నవంబర్ 24,

కల్వకుంట్ల కవిత.. పరిచయం అక్కరలేని పేరు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముద్దుల తనయ.. మాజీ ముఖ్యమైన మంత్రి కల్వకుట్ల తారక రామారావు చెల్లి. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక నిందితురాలు. ప్రస్తుతం బీఆర్ఎస్ బహిష్కృత నేత. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు. పార్టీలోనే ఉంటూ కేసీఆర్‌కు పార్టీ వ్యవహారాలపై బహిరంగ లేఖ రాయడం.. హరీశ్‌రావు, సంతోష్‌రావు వంటి నేతలపై ఆరోపణలు చేయడంతో పార్టీ నుంచి కవితను వెళ్లగొట్టారు. ఇప్పుడు ఆమె ఒంటరి. తన జాగృతి సంస్థను చూసుకుంటున్నారు. ఈ జాగృతి పేరుతోనే ఇటీవల జనం బాటకు శ్రీకారం చుట్టారు. కానీ.. ఆమె చేస్తున్న యాత్రలో జనం మాత్రం కనిపించడం లేదు.బీఆర్ఎస్ నుంచి బహిష్కరించిన తర్వాత ఆమె 'జనం బాట' పేరిట జిల్లాల పర్యటన చేస్తున్నారు. ప్రజల మధ్యకు వెళ్లి గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఆమె పర్యటనలో సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున కనిపించటం లేదు. జనం కన్నా ఆమె ఫాలోవర్స్, అనుచరులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక ఈ పర్యటనలో కవిత మహిళల, రైతుల దగ్గర సందడి చేసి వారి సమస్యలు తెలుసుకోవడం, సాయంత్రం యువతను, ఇతర శ్రేణులని సమావేశాలు పూర్తి చేసి వచ్చి వారికి మందు, విందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు.కవిత జనం బాట లక్ష్యం ఏమిటన్నది ఆమె వెంట వెళ్లేవారికి గానీ, ఆమె కలుస్తున్నవారికి గానీ అర్థం కావడం లేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేవు. ఆమె పార్టీ పెట్టలేదు. తనను పార్టీ నుండి తొలగించారని ప్రకటించాలని, లేదా కొత్త రాజకీయ ప్రయాణం మొదలుపెట్టాలని కావిత యాత్రతో చెప్పాలనుకుంటోంది అనేది ప్రచారాల్లో ఉంది. కానీ ఈ విషయంపైనా కవిత స్పష్టత ఇవ్వడం లేదు. కేవలం హరీశ్‌రావును విమర్శించడమే లక్ష్యంగా యాత్ర సాగిస్తున్నారు. పది ఉమ్మడి జిల్లాల్లో యాత్ర పూర్తయింది. ఇప్పుడు గ్రేటర్ పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కొద్దోగొప్పు స్పందన కనిపించింది. గ్రేటర్ జిల్లాలో ఆమాత్రం స్పందన కూడా ఉండడం లేదు.కవిత యాత్రపై బీఆర్ఎస్ నేతలు 'పార్టీ వీరోధి', 'ద్రోహం చేశావు' వంటి ఆక్షేపణలు చేస్తూ కవితపై విమర్శలు చేస్తున్నారు. పార్టీ లోపల ఉన్న జనాభావాల కారణంగా ఆమె యాత్ర పెద్ద స్పందన పొందలేదని భావిస్తున్నారు. మరోవైపు కవితకు ప్రస్తుతం మీడియా ద్వారా పెద్ద కవరేజీ లభించడం లేదు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు 'నమస్తే తెలంగాణ', 'సాక్షి' లాంటి పత్రికల్లో ప్రాధాన్యంగా వార్తలు వెలువడేవి, కానీ ఇప్పుడు జిల్లా పేజీలలో చిన్న ఫోటోలు పెట్టి కవిత వార్తను ఏదో ఒక మూలన ప్రచురిస్తున్నారు. దీంతో ఆమె సోషల్ మీడియానే ఎక్కువగా నమ్ముకున్నట్లు కనిపిస్తోంది.మొత్తంగా కవిత పర్యటన యథార్థ గమ్యం, సామాజిక?రాజకీయ ప్రయోజనాలు ఇంకా అర్థం కావడం ఇంకా స్పష్టంగా లేదని చెప్పవచ్చు. ఆమె నాయకత్వ యాత్ర కొనసాగితే, జనసమ్మతి, మద్దతు ఎలా మారిపోతుందో చూడవలసి ఉంటుంది.

# టెంపుల్ కారిడార్

హైదరాబాద్, నవంబర్ 24

తెలంగాణ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది, ఇప్పటికే హ్యామ్ విధానంలో దాదాపు రూ.లక్ష కోట్ల రోడ్డు ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ముఖ్యమైన రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తాజాగా.. మరో కొత్త రహదారి అందుబాటులోకి రానుంది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నుంచి నిజామాబాద్ జిల్లాలోని బాసర వరకు ప్రతిపాదించిన ముఖ్యమైన టెంపుల్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.380 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదివారం ప్రకటించారు. తాను పంపిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయడంలో సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ ప్రతిపాదిత టెంపుల్ కారిడార్ తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానించనుంది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం నుంచి నిజామాబాద్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయం వరకు ఈ కారిడార్ విస్తరించి ఉంటుంది. ధర్మపురి, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, భీమ్‌గల్ లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, బాసర ఆలయాలను కలుపుతూ నిర్మించనున్నారు. ఈ కారిడార్ పూర్తయితే.. ఉత్తర తెలంగాణలోని ముఖ్యమైన శైవ, వైష్ణవ, శక్తి, విద్యా దేవాలయాలను ఒకే గొలుసుకట్టులో సందర్శించడానికి భక్తులకు చాలా సౌకర్యంగా ఉంటుంది.ప్రస్తుతం ఈ పుణ్యక్షేత్రాలకు వెళ్ళడానికి ఉన్న రోడ్లు చాలా వరకు ఇరుకుగా, గుంతలతో, కొన్ని చోట్ల మరమ్మతులకు గురై ఉన్నాయి. కారిడార్ నిర్మాణం వల్ల రహదారులు వెడల్పుగా.. మెరుగైన నాణ్యతతో తయారవుతాయి. నాణ్యమైన రోడ్ల కారణంగా ధర్మపురి- బాసర మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ కారిడార్ మార్గంలో ఉన్న చిన్న పట్టణాలు, గ్రామాల ప్రజలకు పర్యాటక, వాణిజ్య రంగాలలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తెలంగాణలోని ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా అంతర్జాతీయంగా విస్తరించడానికి ఈ కారిడార్ కీలకంగా మారుతుంది.ప్రస్తుతం ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, లింబాద్రి గుట్టలను కలుపుతూ ఉన్న రోడ్లు జిల్లా, రాష్ట్ర రహదారులుగా ఉన్నాయి. వీటిలో చాలా మార్గాలలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటం, వాహనాల వేగానికి అనుగుణంగా రోడ్ల వెడల్పు లేకపోవడం, కొన్నిచోట్ల భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల త్వరగా గుంతలు పడటం వంటి సమస్యలు ఉన్నాయి. టెంపుల్ కారిడార్ నిర్మాణం ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతుందని అధికారులు భావిస్తున్నారు.

# హైదరాబాద్ సంగతి ఏంటీ

హైదరాబాద్, నవంబర్ 24,

హైదరాబాద్ 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగానే తెలుసు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టింది. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసింది. రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తగ్గించింది. ఇక రక్షణ విషయంలోనూ అనేక చర్యలు చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. కానీ, రెండేళ్లలో హైదరాబాద్‌కు ఆయన పెద్దగా చేసింది ఏమీ కనిపించడం లేదుతెలంగాణకు విశ్వనగరం హోదా వచ్చినా.. రాష్ట్రానికి సగం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తున్నా.. నగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఐటీ రంగం, ఇతర పరిశ్రమలు మరియు సేవలు నగర అభివద్ధిని ముందుకు నడిపిస్తున్నాయి. కోటి జనాభా దాటిన హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులే 10 లక్షల మంది ఉన్నారు. వీరిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 15 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. అయినా నగరం గడిచిన రెండేళ్లలో పెద్దగా అభివృద్ధి చెందిన దాఖలాలు కనిపించడంలేదు. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ నగర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారుహైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రతిపాదనలు ఉన్నా, కార్యాచరణలో అందుబాటులోకి రావడం లేదు. ముఖ్యంగా నానల్ నగర్ ట్రై జంక్షన్, బేగంపేట, రసూల్పురా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో కొత్త ఫ్లైఓవర్‌లు, రోడ్డు విస్తరణలకు ప్రతిపాదనలు చేసినా, నిర్మాణ పనులు ప్రక్రియలోనే ఉన్నాయి.రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ రోడ్డులకు కేవలం రూ.2,654 కోట్లు మాత్రమే కేటాయించారు. నీరు, డ్రెయినేజీ, మెట్రోతో సహా ఇతర పనులకు మరో రూ.6 వేల కోట్లు కేటాయించారు. కానీ ఉచిత పథకాలకు రూ.లక్ష కోట్లు కేటాయించారు. హైదరాబాద్ రోడ్లకన్నా 'కళ్యాణలక్ష్మి', 'షాదీముబారక్' వంటి పథకాలకు ఎక్కువ నిధులు రూ.3,683 కోటుల కేటాయించారు.నగరంలో 24 గంటలు తాగునీరు కల్పించడం, రెయిన్ వరదలు, మెట్రో విస్తరణ వంటి ప్రాధాన్య అంశాల్లో ఆచరణలో పురోగతి లేదు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తర్వాత ప్రజల్లో అభివృద్ధికి కొత్త ఆశలు వెలిగాయి. రాబోయే మూడేళ్లలో అయినా ప్రభుత్వం సమగ్ర దృష్టితో హైదరాబాద్‌ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉంది.ఆదాయ కేంద్రమైన హైదరాబాద్ పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. నూతన మౌలిక సదుపాయాలు, మెట్రో విస్తరణ, రోడ్డు పనులు, కనీస సేవలు పై ప్రత్యేక దృష్టి పెట్టితే, నగరం బంగారు బాతుగుడ్డు నుంచి ప్రజల నిండైన అనుభవానికి మారుతుంది. కొత్తగా మరో 10 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పరోక్షంగా మరో పది లక్షల మంది ఉపాధి పొందుతారు. కంపెనీలు హైదరాబాద్‌కు తరలి వస్తాయి. లేదంటే బెంగళూరులా మారిపోతుంది.

# ఇండ్లు లేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి జూపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (భారత శక్తి): ఇండ్లు లేని పేదలందరికీ సొంత ఇంటి కలను



నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

సోమవారం భైంసా మండలం ఎగ్గాం గ్రామంలో కండేక కవిత, ధర్మపాల్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో ఒకదాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇంటిలేని పేద కుటుంబాల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతి అర్హ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. పేదల గృహసాధన లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులను శాలువాలతో సన్మానించారు.

ప్రారంభోత్సవంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పట్ల జిఆర్ఏలు భాధ్యతాయుతంగా స్పందించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, నవంబర్ 24 (భారత శక్తి): అర్జీదారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై జిఆర్ఏ (గ్రీవిన్స్ రిడ్రెసల్ అథారిటీ) అధికారి బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంలో స్పందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు.

సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన,నాణ్యమైన వేగ వంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు.ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పొంతన లేని సమాధానాలు అర్జీదారులకు ఇవ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు శాఖాధిపతులు ఎల్లపుడు పై స్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అంది పుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు.

అన్ని శాఖల్లో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు "0" స్థాయిలోకి వచ్చేలా పునఃపరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ పై ప్రైవేట్ వైద్యులతో సమావేశం"

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 ( భారత శక్తి): సోమవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో కెమికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 మరియు పీసీ %ఎ% పి ఎన్ డి టి యాక్ట్ పై సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ గారు మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నియమ నిబంధనలను మరియు పిసిపి ఎన్డిటి నిబంధనలను అందరు వైద్యులు పాటించాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని, సర్వీస్ చార్జెస్ లిస్ట్ ప్రదర్శించాలని, ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుల పేర్లు అందిస్తున్న సేవలను తెలపాలని తెలియజేయడం జరిగింది.

అదేవిధంగా ఫైర్ సేఫ్టీ మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ,బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలియజేయడం జరిగింది.

ఈ సమావేశంలో కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్స్ నయనా రెడ్డి ,సౌమ్య, ప్రత్యూష, ఆశిష్ రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ రామచంద్ర రెడ్డి, స్టేట్



సెక్రటరీ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి బారె రవీందర్ జిల్లాలోని ప్రైవేట్ వైద్యులు మరియు కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు ఘనంగా సన్మానం

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 24 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇటీవల తాజాగా ప్రకటించిన జిల్లా కమిటీ అధ్యక్షులుగా సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సంగీతం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వేములవాడ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో సోమవారం నాయకులు నూతనంగా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన సంగీతం శ్రీనివాస్ కు సిరిసిల్ల పట్టణంలోని వారి నివాసంలో ఘనంగా సన్మానించి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నియమకంపై నాయకులు సంతోషం వ్యక్తం చేసి పార్టీ బలపడేందుకు అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ నాయకత్వం ఎంతో కీలకమని అన్నారు.అనంతరం జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో 35 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాకు విశ్వసించి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కట్టుబడి పని చేస్తానని అన్నారు,అలాగే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించే విధంగా చూస్తానని అన్నారు. అలాగే తనను



సన్మానించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు ప్రసాద్, నాయకులు అంబాటి చందు,ఎర్రం రాజు, మాజీ సర్పంచ్ ప్రదీప్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఎ. సురేష్ రెడ్డి

విజయవాడ, నవంబర్ 24,(భారత శక్తి): దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (సీనియర్ డిఓఎం)గా ఎ. సురేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనుభవజ్ఞుడైన రైల్వే అధికారి అయిన ఆయన గతంలో సికింద్రాబాద్ డివిజన్‌లో సీనియర్ డిఓఎంగా



పనిచేశారు. రైలు కార్యకలాపాలు, భద్రతా ప్రణాళిక మరియు పరిపాలనా నాయకత్వంలో విస్తృతమైన అనుభవాన్ని కలిగి ఉన్నారు.

ఆయన తన కెరీర్‌ను సనత్ నగర్‌లో ఏరియా ఆఫీసర్‌గా ప్రారంభించారు. అప్పటి నుండి బహుళ విభాగాలలో కార్యాచరణ సామర్థ్యానికి గణనీయంగా దోహదపడ్డారు. ఆయన చేసిన ఆదర్శప్రాయమైన సేవ ఆయనకు రైల్వే మంత్రి అవార్డు మరియు జనరల్ మేనేజర్, ఎస్ సి ఆర్ అవార్డుతో సహా ప్రతిష్టాత్మక గుర్తింపులను సంపాదించిపెట్టింది, ఇది ఆయన శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

విద్యాపరంగా, శ్రీ రెడ్డి ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం పరిధిలోని కర్నూలు మెడికల్ కాలేజీ (2012) నుండి ఎం బి బి ఎస్ డిగ్రీని మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎంబీఏ పట్టా పొందారు, సాంకేతిక మరియు నిర్వాహక సామర్థ్యాల బలమైన కలయికను అందిస్తున్నారు.

అతని నియామకం కార్యాచరణ వ్యూహాలను మరింత బలోపేతం చేస్తుందని, సేవా బట్వాడాను మెరుగుపరుస్తుందని మరియు భద్రత, సమయపాలన మరియు ఆవిష్కరణలపై డివిజన్ యొక్క కొనసాగుతున్న దృష్టికి మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు.

# బ్రహ్మణులను కించపరిచిన జి. డి. సారయ్య పై బోడుప్పల్ బ్రాహ్మణ సంఘం మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




హైదరాబాద్, నవంబర్ 24(భారత శక్తి):

గత కొన్ని రోజుల క్రితం, డప్పు సంస్కరణ సభలో జీ. డి. సారయ్య మరియు అతని టీం, మనం బ్రాహ్మణ సమాజ మానోభావాలను దెబ్బతినే విధంగా ఒక పాట రూపకంగా అంటే బ్రాహ్మణుల వస్త్ర దారణ, ఎంతో పవిత్రంగా భావించే యజ్ఞోపవీతం గురించి, సనాతన ధర్మాచారణ గురించి ఎగతాళిగా మన యావత్ బ్రాహ్మణ సమాజాన్ని చాలా అవమానించారు. ఇదే పాటను తన యూట్యూబ్ లో అప్లోడ్ కూడా చేసాడు.

చాలా బ్రాహ్మణ సంఘాలు తమ తమ ఏరియా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది.

అదే విధంగా బోడుప్పల్ అఖిల బ్రాహ్మణ వికాస సమితి కూడా అద్యక్షులు వై. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సమితి నాయకుల సమక్షంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్సక్టర్ గారికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడం జరిగింది. వై. శ్రీనివాస రావు, నంద్ కుమార్ జోషి ఇన్స్పెక్టర్ గారితో మాట్లాడుతూ యూట్యూబ్ లో అప్లోడ్ చేసిన వీడియో ను పరిశీలించి వెంటనే ఈ వీడియోను తొలగించి జీ. డి. సారయ్య, ఇతర సంబంధిత వ్యక్తులపై భారత శిక్షాశృతిని అనుసరించి కఠిన చర్యలు తీసుకోవాలని సమితి తరఫున విజ్ఞప్తి చేశారు.

పాల్గొన్న సమితి ప్రముఖులలో వై. శ్రీనివాస రావు, నంద్ కుమార్ జోషి, మంద జగన్నాథం, కె. గురునాథ రావు, వై. సుధాకర్ రావు, సి. సాయిరామ్, శ్యామాల రావు, దుర్గా ప్రసాద్, సత్య వర ప్రసాద్, కరుణ కుమార్, రామ కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారని పి. ఆర్. ఓ. గురునాథ రావు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ,నవంబర్ 24 (భారత శక్తి) : ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారమైందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోని సగ్గు లావణ్య- శ్రీనివాస్ లు నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని సోమవారం గృహ ప్రవేశం చేసుకున్నారు. ఈ గృహ ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు.సీఎం రేవంత్ రెడ్డి ఫోటోతో నూతన ఇంటిలోకి ప్రవేశించిన లబ్ధిదారులు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఉన్న తమ సొంతింటి కలను కేవలం కొన్ని నెలల కాలంలోనే ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేర్చిందని ఆనందం వ్యక్తం చేశారు.తమ కలను సాకారం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ఇంత గొప్ప పథకం ద్వారా మా జీవితాల్లో వెలుగులు నింపినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ఎన్నో ఏండ్లు ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో కీలకమైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం గౌరవప్రదమైన నివాసం కలిగి, సంతోషంగా జీవించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,మాజీ ఎంపిటిసి నాగుల



రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగుల విష్ణు, నాయకులు సయ్యద్ సాబిర్,దుర్గం పర్షయ్య, ఇర్ఫాన్, నాగుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రుణమార్పిడి పథకం పై రైతులకు అవగాహన



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 24( భారత శక్తి): రైతుల్లో పెరుగుతున్న రుణభారం, అధిక వడ్డీ రుణాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన మధ్యవర్తి చెన్నామల్లారెడ్డి పాల్గొని అవగాహన కల్పించారు .సోమవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఋణమార్పిడి పథకం పై అవగాహన పై

చెన్నామల్లారెడ్డి మాట్లాడుతూ, ఋణమార్పిడి పథకం ద్వారా రైతులు ప్రైవేట్ దళారీల అధిక వడ్డీ రుణాల నుండి బయటపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత రుణాలను తక్కువ వడ్డీతో ఉన్న బ్యాంకు రుణాల్లోకి మార్చుకోవడం, రైతులకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. రుణ మార్పిడి ప్రక్రియలో పత్రాల ప్రాముఖ్యత, బ్యాంకులతో నేరుగా మాట్లాడాల్సిన అవసరం, మధ్యవర్తులపైన ఆధారపడకూడదన్న విషయాల్లో రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులకు అధిక రుణ భారానికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చని తెలియజేశారు. సమావేశం అనంతరం పలువురు రైతులు ఋణమార్పిడి పథకం గురించి స్పష్టమైన అవగాహన కలిగిందని, దీనివల్ల రుణ భారాన్ని తగ్గించుకునే నమ్మకం కలిగిందని చెప్పారు.

# ప్రజా సమస్యలపై పూర్తి దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య – ప్రజావాణికి 76 దరఖాస్తులు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతిది, నవంబర్ 24:జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 76 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు .అలాగే ప్రజల ప్రాధాన్య సమస్యలపై పూర్తి దృష్టి పెట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , మాధురి డి.ఆర్.ఓ పద్మజ రాణి సంబంధిత శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్, కేటీఆర్ చర్చోపచర్చలు



హైదరాబాద్, నవంబర్ 24,

తెలుగు రాష్ట్రాల్లో కెసిఆర్, జగన్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే. పరస్పర రాజకీయ ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా ఇద్దరు వెళ్తారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడి రాజకీయ ప్రయోజనాలకి పెద్దపీట వేశారు. అయితే ఇప్పుడు ఇద్దరూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. వారిద్దరూ ఉమ్మడి శత్రువుగా భావించే చంద్రబాబు ఏపీకి సీఎం అయ్యారు. ఆయన సన్నిహితుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. ఆపై చంద్రబాబు కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటువంటి తరుణంలో చంద్రబాబు విషయంలో కెసిఆర్ పార్టీ వైఖరి మారింది. కానీ జగన్ మాత్రం అదే శత్రుత్వంతో మెలుగుతున్నారు. ఎందుకంటే ఏపీలో నేరుగా ప్రత్యర్థి కాబట్టి. ప్రస్తుతం బెంగళూరులో ఎక్కువగా గడుపుతున్న జగన్మోహన్ రెడ్డి ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. అక్కడ భారీగా జన సమీకరణ చేశారు. హైదరాబాదు నుంచి బెంగళూరు చేరుకున్న జగన్మోహన్ రెడ్డిని తాజాగా ప్రైవేటు కార్యక్రమంలో కలుసుకున్నారు కేటీఆర్. వాటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అయితే తెలుగు రాష్ట్రాల్లో ఈ రెండు పార్టీలకు చంద్రబాబు ఉమ్మడి శత్రువు. ఆపై కాంగ్రెస్ అంటే వ్యతిరేక స్వభావం. బిజెపితో కలవాలనుకున్న వీలు లేని పరిస్థితి. ఏ కూటమిలో చేరే పరిస్థితి కూడా లేదు. ఇటువంటి సంకట స్థితిని ఆ రెండు పార్టీలు ఊహించి ఉండవు. అయితే ప్రస్తుతం ఆరోగ్యం రీత్యా కెసిఆర్ అంత క్రియాశీలకంగా లేరు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ అన్ని తానై వ్యవహరిస్తున్నారు. అయితే ఆయన నేరుగా జగన్మోహన్ రెడ్డితో చర్చలు జరపడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. అసలు జగన్మోహన్ రెడ్డితో కేటీఆర్ ఏం చర్చించారు? రాజకీయంగా కలిసి అడుగులు వేయబోతున్నారా? లేకుంటే ఎన్నికల వరకు వేచి చూడాలనుకుంటున్నారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. అయితే తప్పకుండా కొద్ది రోజులపాటు వేచి ఉండాల్సిందేనని ఇద్దరు నేతలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 2029 ఎన్నికల ముందున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుందామని నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బిజెపిని తెలుగుదేశం పార్టీ విడిచిపెట్టదు. జనసేన సైతం ఆ సాహసం చేయదు. అందుకే లేనిపోని రాజకీయాలు చేయడం కంటే గతం మాదిరిగా ఒంటరి పోరాటమే ఆ రెండు పార్టీలకు ముందున్న కర్తవ్యం. మరోవైపు జగన్మోహన్ రెడ్డితో పాటు కేటీఆర్ కు కేసులు వెంటాడుతున్నాయి. ఈ క్షణంలోనైనా వారి అరెస్టు జరుగుతుందని ప్రచారం నడుస్తోంది. అయితే వారు జైలుకు వెళ్తే పార్టీలు ఎవరు నడుపుతారు అన్నది ప్రశ్న. ఆ ఇద్దరు నేతలకు చెల్లెళ్ల నుంచి ప్రమాదం ఉంది. తెలంగాణలో కవిత, ఏపీలో షర్మిల సోదరులను విభేదించి రాజకీయాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే చెల్లెళ్లను ఎలా కట్టడి చేయాలో తెలియక ఇద్దరు మల్ల గుల్లాలు పడుతున్నారు. దీనిపై సోషల్ మీడియాలో సైతం సెటైర్లు పడుతున్నాయి.

## బూర్గంపాడు లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 24, బూర్గంపాడు మండల కేంద్రం ఎంపిడిఓ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు ఈకార్యక్రమంలో పాయం మాట్లాడుతూ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అని ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ప్రవేశపెట్టారని మహిళలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితబస్సు ప్రయాణం దగ్గరనుండి బస్సుల పంపిణీ అన్నింటిలోనూ మహిళలకు పెద్దపీట వేశారని అన్నారు...

# ఇక నుంచి డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్..!

హైదరాబాద్, నవంబర్ 24

తెలంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతిని అరికట్టేందుకు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా.. ఇకపై ఇండ్లు, ఖాళీ స్థలాలకు కూడా వ్యవసాయ భూముల మాదిరిగా పక్కాగా 'యాజమాన్య హక్కు పత్రం' (టైటిల్) ఇవ్వాలని యోచిస్తోంది. ఈ వ్యవస్థలో 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని ప్రవేశపెట్టడం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల కబ్జాలను నివారించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే.. సర్వే నంబర్ బ్లాక్ విధానం ద్వారా లేఅవుట్ మోసాలను అడ్డుకోవాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకత తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇన్నాళ్లు కేవలం వ్యవసాయ భూములకు మాత్రమే ఇస్తున్న 'పట్టా' (లేదా టైటిల్) విధానాన్ని ఇకపై ఇండ్లు, ఖాళీ స్థలాలకు కూడా వర్తింపజేయాలని యోచిస్తోంది. దీని ప్రకారం.. ఆస్తి యజమానుల పేరు మీద పక్కాగా 'యాజమాన్య హక్కు పత్రం' ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తరుచూ వెలుగు చూస్తున్న అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్లు, అలాగే నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం వంటి సమస్యలను ప్రభుత్వం చాలా గౌరవంగా తీసుకుంది. ముఖ్యంగా ఆస్తి వివాదాలు ఎక్కువై కోర్టులకు ఎక్కుతుండటం, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం వల్లే ఈ వ్యవస్థలో సమూల మార్పులు




తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్పుల కోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు కలిసి కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో మానవ ప్రమేయాన్ని తగ్గించి.. అవినీతికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా.. అత్యాధునికమైన 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగించేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ టెక్నాలజీ గొప్పతనం ఏంటంటే.. ఒకసారి ఆస్తి వివరాలు ఇందులో నమోదైతే, వాటిని మార్చడం లేదా చెరిపివేయడం అసాధ్యం. ఒక వ్యక్తి పేరు మీద ఇప్పటికే రిజిస్టర్ అయిన ఆస్తిని.. మళ్లీ వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయడానికి ఈ సిస్టమ్ అస్సలు ఒప్పుకోదు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు వంటి నిషేధిత జాబితాలోని ఆస్తుల వివరాలను ఈ టెక్నాలజీలో నిక్షిప్తం చేస్తారు. వాటిని ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నిస్తే... సాఫ్ట్‌వేర్ వెంటనే తిరస్కరిస్తుంది. దీనివల్ల సబ్ రిజిస్ట్రార్ల పాత్ర లేకుండానే అక్రమాలు ఆగిపోతాయి. డబుల్ రిజిస్ట్రేషన్ల బెడద, ప్రభుత్వ భూముల కబ్జాలను నివారించడానికి 'సర్వే నంబర్ బ్లాక్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ కొత్త సిస్టమ్‌లో.. ఒక సర్వే నంబర్‌లో ఎంత భూమి విస్తీర్ణం ఉంది.. అందులో ఎంత రిజిస్ట్రేషన్ అయింది.. ఎంత మిగిలి ఉంది అనే లెక్కలు పక్కాగా తెలుస్తాయి. ఉన్న భూమి కంటే ఒక్క గజం ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించినా.. సాఫ్ట్‌వేర్ వెంటనే లావాదేవీని ఆపేస్తుంది. రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో కొనుగోలుదారులను మోసం చేసే విధానానికి కూడా ఈ కొత్త విధానంలో అడ్డుకట్ట పడుతుంది. వెంచర్లలో రోడ్లు, పార్కులు వంటి మౌలిక వసతుల కోసం స్థలాన్ని కేటాయించకుండా.. ఆ స్థలాన్ని కూడా ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. ఇకపై.. లేఅవుట్‌లోని రోడ్లు, పార్కులను ముందే డిక్లేర్ చేసి, మిగిలిన ప్లాట్ల విస్తీర్ణం వాస్తవ భూమికి సరిపోతేనే రిజిస్ట్రేషన్లు జరిగేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయనున్నారు. ఈ టైటిల్ విధానం అమల్లోకి వస్తే.. భవిష్యత్తులో ఆస్తిపై ఎవరి పేరు మీద, ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఆస్తి ఉంది అనే పూర్తి వివరాలు ఒకే పత్రంలో ఉంటాయి. దీనివల్ల నకిలీ పత్రాలు సృష్టించి అమ్మే ముఠాల ఆటలు సాగవు. ఆస్తి తగాదాలు సగానికిపైగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తున్నది. కొత్త విధానంలో.. ఆస్తి చరిత్రను పూర్తిగా పరిశీలించేందుకు 1983 నుంచి ఉన్న ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) వివరాలను కూడా అనుసంధానించనున్నారు. దీనివల్ల ఆ ఆస్తి గత 40 ఏళ్లుగా ఎవరెవరి చేతులు మారింది.. లింక్ డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం కావడం వల్ల ఆస్తి చరిత్ర మొత్తం ఆన్‌లైన్‌లో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

# మంత్రుల వాట్సప్ హ్యాక్..

హైదరాబాద్, నవంబర్ 24,

సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) గ్రూపుతో పాటు పలువురు రాష్ట్ర



మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూపులను లక్ష్యంగా చేసుకున్నారు. ఎస్‌బీఐ బ్యాంక్ ఆధార్ అప్‌డేషన్ పేరుతో ఫేక్ ఏపీకే ఫైల్స్‌ను షేర్ చేసి.. తొలుత జర్నలిస్టుల ఫోన్లను హ్యాక్ చేశారు. వారి ఫోన్ల ద్వారానే కీలక గ్రూపుల్లోకి చొరబడ్డారు. ఈ ఘటన రాష్ట్ర పరిపాలనలో కలకలం రేపింది. సైబర్ పోలీసులు వెంటనే అప్రమత్తమై.. ఏపీకే ఫైల్స్, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నా.. రకరకాల మోసపూరిత విధానాలను అనుసరిస్తూ సవాలు విసురుతున్నారు. తాజాగా.. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) గ్రూపుతో సహా పలువురు రాష్ట్ర మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూపులను లక్ష్యంగా చేసుకుని హ్యాక్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సైబర్ దాడిలో కేటుగాళ్లు అనుసరించిన విధానం తెలివైనదిగా ఉంది. వారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరును.. ఆధార్ అప్‌డేషన్ పేరును అడ్డుపెట్టుకున్నారు. మంత్రులు, జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న గ్రూపుల్లోకి ప్రవేశించి.. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తూ ప్రమాదకర ఏపీకే ఫైల్స్‌ను షేర్ చేశారు. తొలుత ఓ జర్నలిస్టుకు సంబంధించిన ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ ఫోన్ ద్వారానే ముఖ్యమంత్రి కార్యాలయం గ్రూపు, డిప్యూటీ సీఎం గ్రూపులు, మంత్రుల అధికారిక గ్రూపులు వంటి అత్యంత కీలకమైన మీడియా సంబంధిత వాట్సాప్ గ్రూపులను ప్రభావితం చేశారు. ఈ ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేసిన వెంటనే.. వినియోగదారుల ఫోన్‌లోని నియంత్రణ వ్యవస్థను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. అప్పటి నుంచి ఆ ఫోన్ ద్వారానే గ్రూపుల్లో ఎస్‌బీఐ ఆధార్ లింకు పేరుతో ఆ ఫైల్స్ ప్రత్యక్షమయ్యాయి. అయితే.. ఈ హ్యాకింగ్ వార్త వైరల్ అయిన వెంటనే సీఎంవో గ్రూపు అడ్మిన్‌లు స్పందిస్తూ.. 'సీఎంవో గ్రూపు సురక్షితం' అని సమాచారం అందించారు. రాష్ట్ర పరిపాలనలో కీలకమైన సమాచార మార్పిడి జరిగే గ్రూపులను లక్ష్యం చేసుకోవడం వెనుక.. కేవలం డబ్బు దండుకోవడమే కాకుండా.. ప్రభుత్వ సమాచారాన్ని సేకరించడం లేదా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం వంటి దురుద్దేశాలు కూడా ఉండే అవకాశం ఉందని సైబర్ నిపుణులు అనుమానిస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల హ్యాకింగ్ వ్యవహారం కలకలం రేపిన నేపథ్యంలో.. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. హ్యాకైన వాట్సాప్ గ్రూపులను సురక్షితంగా ఉంచారు. కేవలం ఎనిమిది రోజుల క్రితమే తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్ అయిన సంగతి తెలిసిందే. కోర్టు ఆర్డర్ కాపీలను డౌన్‌లోడ్ చేస్తుండగా గేమింగ్ సైట్‌లోకి దారి మళ్లించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై హైకోర్టు రిజిస్ట్రార్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సైబర్ నిపుణులు ఈ సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా జర్నలిస్టులకు, అధికారులకు కొన్ని ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. ఏపీకే ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దు. అపరిచితుల నుంచి లేదా అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ ఆధార్/కేవైసీ అప్‌డేట్ కోసం ఏపీకే ఫైల్స్‌ను వాట్సాప్‌లో పంపవని గుర్తించాలి. వ్యక్తిగత డేటాను రక్షించుకోవడానికి ఫోన్లలో సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు

## మంథని డిపో నుండి శబరీమల కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

### –అయ్యప్ప స్వామి భక్తులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలి

### –మంథని డిపో మేనేజర్ వి.శ్రావణ్ కుమార్

మంథని నవంబర్ 24,

టీజిఎస్ఆర్టీసీ టూర్ ప్యాకేజీ లో భాగంగా మంథని డిపో నుండి శబరీమల కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపనున్నట్లు మంథని డిపో మేనేజర్ వి.శ్రావణ్ కుమార్ సోమవారం తెలిపారు. మంథని నుండి బయలుదేరి హైదరాబాద్ –శ్రీశైలం– మహానంది–కాణిపాకం –పంబ చేరుకుని తిరుగు ప్రయాణంలో మదురై– రామేశ్వరం –తిరుపతి– విజయవాడ– వరంగల్– ద్వారా మంథని కి చేరుకుంటుందన్నారు. ఇట్టి ప్రయాణానికి గాను చార్జి ఒకరికి 6900 రూపాయలుగా నిర్ణయించడమైనదన్నారు.


ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో బార్డర్ టాక్స్ మరియు పార్కింగ్ చార్జీలను బస్సు బుక్ చేసుకున్న వారే చెల్లించవలసి ఉంటుందని తెలిపినారు. ఒకే బృందంగా వచ్చి 35 సీట్లు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు ఇద్దరు వంట మనుషులు, ఇద్దరు మణికంఠ స్వాములు (10 సంవత్సరాల లోపు వారు) మరియు ఒక అటెండర్ కు సీటు లేకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించబడునని తెలిపారు. కావున అయ్యప్ప స్వామి భక్తులు ఇట్టి సదావకాశాన్ని ఉపయోగించుకొని అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. బస్సు బుకింగ్ కొరకు 9959225923,9948671514 లేదా మంథని డిపో లో సంప్రదించగలరని తెలిపారు.

# గీతంలో ఉత్సాహంగా ఎన్ సిసి దినోత్సవం

### – కవాతుతో ఆకట్టుకున్న క్యాడెట్లు

### – అదనంగా మరో 80 మంది క్యాడెట్ల మంజూరు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 24:



హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 77వ ఎన్ సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని దాదాపు 100 మంది క్యాడెట్లతో ఉత్సాహంగా నిర్వహించారు. 1948లో స్థాపించిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సీసీ), భారతదేశ యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవ, దేశ నిర్మాణాన్ని పెంపొందిస్తున్న విషయం విదితమే. ఈ వేడుకలు క్యాడెట్ల సమావేశం, కవాతుతో ప్రారంభమయ్యాయి. తరువాత గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు జెండా ఎగురవేయగా, క్యాడెట్లు ఎన్ సీసీ ప్రతిజ్ఞ చేసి, విధి, జాతీయ విలువల పట్ల వారి నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిజామాబాదులోని ఎన్ సీసీ గ్రూపు ప్రధాన కార్యాలయ గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ కపూర్ ఎఫ్ఎఫ్ఎఫ్ఎస్ పథకం కింద అదనంగా మరో 80 మంది క్యాడెట్లను మంజూరు చేశారని ప్రొఫెసర్ డీ.ఎస్.రావు వెల్లడించారు. దీని వలన గీతం క్యాడెట్ల సంఖ్య 160కి పెరిగి, దాదాపుగా రెట్టింపు అయిందని, ఇకమీదట పూర్తి కంపెనీగా పనిచేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. సంగారెడ్డిలోని 33 (టి) బెటాలియన్ కింద పనిచేస్తున్న గీతం ఎన్ సీసీ గత ఐదేళ్లుగా శారీరక శిక్షణ శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో స్థిరంగా రాణించిందని రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తెలిపారు. యువశక్తి %–% వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా బాధ్యతాయుతమైన, దేశ భక్తి, క్రమశిక్షణతో కూడిన యువతను రూపొందించడంలో ఎన్ సీసీ కీలక పాత్ర పోషిస్తోందని ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ సీసీ అండర్ ఆఫీసర్ల సహకారంతో, కేర్ టేకింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్ సమన్వయం చేశారు. వివిధ కార్యక్రమాలలో రాణించిన అత్యుత్తమ క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు. గీతం ఎన్ సీసీలో భాగంగా, క్యాడెట్ల ఐక్యత, గర్వాన్ని ప్రతిబింబించే గ్రూపు ఫోటో సెషన్ తో కార్యక్రమం ముగిసింది.

# భోజన నాణ్యతపై ఆగ్రహించిన విద్యార్థులు

# శ్రీ చైతన్య కాలేజ్లో ధర్నా

ఖమ్మం నవంబర్ 24,



ఖమ్మం జిల్లా హర్షా కాంప్లెక్స్లో ఉన్న శ్రీ చైతన్య కాలేజ్లో సోమవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. కాలేజ్ హాస్టల్ అందిస్తున్న భోజనం నాణ్యత బాగాలేదంటూ పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. విద్యార్థుల ప్రకారం, గత కొన్ని నెలలుగా క్యాంటిన్లో అందిస్తున్న భోజనం రుచిగా ఉండకపోవడం, తరచూ చల్లగా పెట్టడం, శుభ్రత లోపించడంపై పలు సార్లు ఫిర్యాదు చేసినా, కాలేజ్ యాజమాన్యం స్పందించలేదని ఆరోపించారు. “పొంగల్లో రాళ్లు, కూరల్లో పురుగులు, అన్నం సరిగా ఉడకడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా పరిష్కారం లేదు” అని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# గువాహటి టెస్టు.. ఏ జట్టుకూ సాధ్యం కాని రికార్డుపై కన్నేసిన సౌతాఫ్రికా



సౌతాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో విఫలమైన టీమ్ఇండియా పీకల్లోతు కష్టాల్లో పడింది. సఫారీ బ్యాటర్లను కట్టడి చేయలేక తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు సమర్పించుకున్న భారత్.. బ్యాటింగ్‌లోనూ తేలిపోయింది. 201 పరుగులకే ఆలౌటై ఓటమి దిశగా పయనిస్తోంది. ఇంకా రెండ్రోజుల ఆట మిగిలి ఉన్న ఈ టెస్టులో భారత్ గెలవాలంటే అద్భుతమే జరగాలి. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిస్తే ప్రపంచంలో ఏ జట్టు సాధించని ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుంటుంది. గువాహటి టెస్టులో గెలిస్తే సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌ను స్వదేశంలో రెండుసార్లు వైట్ వాష్ చేసిన పర్యాటక జట్టుగా సౌతాఫ్రికా రికార్డుల్లోకెక్కుతుంది. భారత్ ఇప్పటివరకు స్వదేశంలో రెండుసార్లు మాత్రమే వైట్ వాష్‌కు గురైంది. 2000 సంవత్సరంలో హాన్సీ క్రోంజే నేతృత్వంలోని సౌతాఫ్రికా జట్టు 20తో టీమ్ఇండియాను ఓడించింది. గతేడాది టామ్ లేథమ్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ 30తో టీమ్ఇండియాను వైట్ వాష్ చేసింది. బీసీసీఐ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 1980లో ముంబయి వేదికగా ఇంగ్లాండ్‌తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు 10 వికెట్ల తేడాతో గెలిచింది. కానీ, సాంకేతికంగా ఒకే మ్యాచ్ ఆడటంతో దీన్ని సిరీస్‌గా పరిగణించరు. గువాహటి టెస్టులో భారత్ ఓడితే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఓ చెత్త రికార్డు మూటగట్టుకుంటాడు. స్వదేశంలో విదేశీ జట్టు చేతిలో రెండు వైట్ వాష్‌లు ఎదుర్కొన్న తొలి హెడ్ కోచ్‌గా నిలుస్తాడు. 2024లో కివీస్ చేతిలో టీమ్ఇండియా వైట్ వాష్‌కు గురైనప్పుడు కూడా గంభీర్ కోచ్‌గా ఉన్న సంగతి తెలిసిందే.




# కబడ్డీ ప్రపంచ కప్.. ఛాంపియన్‌గా భారత మహిళల జట్టు



ఢాకా: భారత మహిళల కబడ్డీ జట్టు ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో 3528తో చైనీస్ తైపీపై గెలుపొందింది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి హోరాహోరీగా సాగింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి భారత్ 2016తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత కూడా ప్రత్యర్థి జట్టు గట్టి పోటీ ఇచ్చింది. మరో ఐదు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా భారత్ 2924తో నిలిచింది. చివరకు ఏడు పాయింట్ల తేడాతో గెలిచిన భారత్ వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. ఈ టోర్నీని తొలిసారిగా 2012లో నిర్వహించగా అప్పుడు కూడా భారత జట్టే ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో భారత్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, ఉగాండా, జర్మనీ, చైనీస్ తైపీ, ఇరాన్, నేపాల్, కెన్యా, జాంజిబార్ (టాంజానియా), పోలాండ్ తలపడ్డాయి. అర్జెంటీనా కూడా పాల్గొనాల్సి ఉండగా.. టోర్నీ ప్రారంభానికి ముందు పోటీల నుంచి వైదొలిగింది.

# గాయాలు బాబోయ్.. సున్నితంగా మారుతున్న స్టార్ ఆటగాళ్లు



ఆట అన్నాక గాయాలు కావడం సహజం. క్రికెట్ కూడా అందుకు మినహాయింపు కాదు. అంతర్జాతీయ క్రికెట్లో గాయాల పాలు కాని ఆటగాళ్లు అరుదు. కానీ భారత జట్టుకు కొన్నేళ్ల నుంచి గాయాలు పెద్ద సమస్యగా మారుతున్నాయి. స్టార్ ఆటగాళ్లు నెలల తరబడి ఆటకు దూరమయ్యే పరిస్థితి వస్తోంది. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుత క్రికెటర్లు మరీ సున్నితంగా తయారవుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం టెస్టులు, వన్డేల్లో భారత జట్టు కెప్టెన్. జట్టులో మూడు ఫార్మాట్లలో ఆడుతున్న అతి కొద్ది మంది ఆటగాళ్లలో అతనొకడు. తన వయసు 26 ఏళ్లే. ఇప్పటిదాకా అతడికి ఫిట్‌నెస్ సమస్యలేమీ లేవు. మైదానంలో పెద్ద గాయాలైన దాఖలాలేమీ లేవు. కానీ అతడికి ఇటీవల ఊహించని సమస్య తలెత్తింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చి మూడు బంతులు ఆడాడో లేదో.. మెడ నొప్పి తలెత్తింది. ఫిజియో వచ్చాడు. చికిత్స అందించాడు. ఇక బ్యాటింగ్ కొనసాగిస్తాడులే అనుకుంటే.. నొప్పి తగ్గకపోవడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. కొన్ని వికెట్లు పడ్డాక అయినా తిరిగొస్తాడనుకుంటే.. అలా ఏమీ జరగలేదు. తర్వాత అతను మైదానంలోకే రాలేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ చేయలేదు. పంతే కెప్టెన్‌గా వ్యవహరించాడు. రెండో టెస్టు సమయానికి గిల్ కోలుకుంటాడనుకుంటే.. ఈ మ్యాచ్‌కే కాదు, దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కూ దూరమయ్యాడు. అతను తిరిగి ఫిట్‌నెస్ ఎప్పుడు సాధిస్తాడో స్పష్టత లేదు. మెడ నొప్పి రోజుల పాటు ఇబ్బంది పెడుతోంది.. రెండు మూడు వారాలకు కూడా కోలుకునే పరిస్థితి లేదు అంటే.. తన సమస్య తీవ్రమైనదే అని అర్థమవుతోంది. ఓ యువ క్రికెటర్‌కు ఇలాంటి ఇబ్బంది తలెత్తడం అరుదైన విషయం. గిల్ పరిస్థితి ఇలా ఉంటే.. వన్డేల్లో జట్టు వైస్ కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్‌ది ఇంకో వింత కథ. అతను గత నెలలోనే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ సందర్భంగా సిడ్నీలో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. డైవ్ క్యాచ్ అందుకోబోయి కింద పడే క్రమంలో అతడి కడుపు లోపల గాయమైంది. ముందు తనది చిన్న గాయమే అనుకున్నారు. కానీ ఆసుపత్రిలో అడ్మిట్ అయి ఐసీయూలో చికిత్స అందుకోవాల్సినంత పెద్ద సమస్య అయింది. తన ప్రాణాలకే ముప్పు తెచ్చే గాయం అంటూ వార్తలు వచ్చాయి. ఆస్ట్రేలియా నుంచి కొన్ని రోజులకే ఇండియాకు వచ్చేసినప్పటికీ.. శ్రేయస్ గాయం పూర్తిగా నయం అయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి మూడు నెలలకు పైగానే సమయం పడుతుందని సమాచారం. అతణ్ని మళ్లీ వచ్చే ఐపీఎల్‌లోనే చూస్తామని అంటున్నారు. శ్రేయస్ 2023లో వెన్ను గాయంతో ఇబ్బంది పడ్డాడు. దాదాపు ఏడాది పాటు ఆటకు దూరమయ్యాడు.





# అమల్లోకి లేబర్ కోడ్స్

## చేతికొచ్చే వేతనం తగ్గినా.. దీర్ఘకాలంలో ప్రయోజనమే!



అమల్లో ఉన్న కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కొత్త కోడ్‌లను కేంద్రం తీసుకువచ్చింది. దీంతో వేతన గణనలో కీలక మార్పు చోటుచేసుకోబోతోంది. మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతం మించరాదని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. దీంతో ఆ మేర శాలరీ విధానంలో మార్పులొచ్చి చేతికందే వేతనం తగ్గనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏళ్లుగా ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రతా కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020లను కేంద్రం తీసుకొచ్చింది. ఈ నెల 21 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీనికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలను 45 రోజుల్లో కేంద్రం వెలువరించనుంది. ఆ నిబంధనలను అనుసరించి ఆ మేర శాలరీ విధానంలో కంపెనీలు తమ శాలరీ విధానాన్ని మార్పు చేసుకోవాల్సి ఉంటుంది. వేతనాల్లో కోడ్‌లో 'వేతనం' అనే పదాన్ని నిర్వచించారు. దీని ప్రకారం అలవెన్సులు 50 శాతానికి మించి ఉండకూడదు. అంటే బేసిక్, డియర్‌నెస్ అలవెన్సు, రిటైనింగ్ అలవెన్సు వంటివి 50 శాతం ఉండాలి. ప్రస్తుతం చాలా కంపెనీలు బేసిక్+డీఏ తక్కువగా చూపుతూ అలవెన్సుల రూపంలో ఎక్కువగా చెల్లిస్తుంటాయి. కొత్త చట్టం ప్రకారం.. వేతన గణన మార్చాల్సి ఉంటుంది. దీంతో వేతనం పెరిగినప్పుడు ఆ మేర పీఎఫ్ (PF) కాంట్రిబ్యూషన్ మొత్తం పెరుగుతుంది. దీనివల్ల చేతికొచ్చే వేతనం తగ్గుతుంది. రిటైర్మెంట్ తర్వాత వచ్చే మొత్తంతో పాటు, గ్రాట్యూటీ ఎక్కువ మొత్తంలో లభిస్తుంది. ప్రస్తుతం బేసిక్ శాలరీలో 12 శాతం పీఎఫ్ మొత్తం కింద వెళుతుంది. ఒకవేళ వేతనం పెరిగితే ఆ మేర పీఎఫ్ మొత్తం కూడా పెరుగుతుంది. గ్రాట్యుటీ మొత్తం కూడా వేతనాన్ని బట్టే గణిస్తారు కాబట్టి ఆ మేర ఆ మొత్తం కూడా పెరుగుతుంది. సవరించిన వేతన విధానం వల్ల చేతికొచ్చే జీతం తగ్గినా.. రిటైర్మెంట్ సమయంలో వచ్చే ప్రయోజనాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కంపెనీలు వేతన విధానంలో ఆ మేర మార్పులు చేయాలి. అలాగని సీటీసీలో ఎలాంటి మార్పూ ఉండదు.


# మరో వ్యాపారంలోకి అదానీ గ్రూప్?.. ఏవియేషన్‌పై మరింత పట్టు!




ముంబయి: అదానీ గ్రూప్ తమ వ్యాపారాలను చాలా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే వివిధ రంగాల్లోకి అడుగుపెట్టిన ఈ కంపెనీ తాజాగా మరో సెక్టార్‌లోకీ ప్రవేశించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. తమ అనుబంధ సంస్థ అయిన డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ద్వారా పైలట్లకు శిక్షణనిచ్చే సంస్థను ప్రారంభించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఉన్న 'ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (FTSC)'ని కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ కంపెనీకి గురుగ్రామ్, హైదరాబాద్, ముంబయిలో సిమ్యులేటర్ సెంటర్లు ఉన్నాయి. హరియాణా, సూరత్, సోలాపూర్‌లో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. ప్రైమ్ ఏరో, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ మధ్య 50:50 జాయింట్ వెంచర్‌గా ఉన్న 'హొరైజాన్ ఏరో సొల్యూషన్స్' ద్వారా ఈ కొనుగోలును చేపట్టనున్నారు. ఏడీఎస్టీ.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ. 'ప్రైమ్ ఏరో'కు ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్ కుమారుడు ప్రజయ్ పటేల్ ప్రమోటర్‌గా ఉన్నారు. ADST చాలా వేగంగా తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఆ దిశగా కొత్త కంపెనీలను ఏర్పాటు చేస్తోంది. ఈ రంగంలో ఇప్పటికే ఉన్న సంస్థలను కొనుగోలు చేస్తోంది. 2024లో 'ఎయిర్ వర్క్స్'లో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. దీంతో విమానాల నిర్వహణ, మరమ్మతుల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. అనంతరం 'Indamer Technics'లో 50 శాతం వాటా కొనుగోలు చేసి మరింత పట్టు పెంచుకుంది. మిగిలిన సగం 'ప్రైమ్ ఏరో' చేతిలో ఉండడం గమనార్హం. రాబోయే కొన్నేళ్లలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో అదానీ గ్రూప్ భారీ వృద్ధిని అంచనా వేస్తోంది. అందుకే పెట్టుబడులను పెంచుతోంది. దాదాపు రూ.5,000 కోట్లు ఇప్పటికే కేటాయించింది. రాబోయే కొన్నేళ్లలో దీన్ని మరింత పెంచే యోచనలో ఉంది. భౌగోళిక అస్థిరతల కారణంగా రక్షణ రంగంలో పైలట్లకు భారీ డిమాండ్ పెరిగింది. అలాగే కమర్షియల్ ఏవియేషన్‌కు కూడా గిరాకీ పుంజుకుంటోంది. ఈ తరుణంలో అదానీ గ్రూప్ ఈ రంగంలోకి ప్రవేశిస్తుండటం విశేషం.


## అమెరికా ఆంక్షల ఎఫెక్ట్..

# భారత్‌కు భారీ డిస్కౌంట్‌తో రష్యన్ ఆయిల్!




రష్యా చమురు వ్యాపారంలో అమెరికా ఆంక్షలు కొత్త మార్పులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్ , లుకోయిల్ లపై ఆంక్షలు అమల్లోకి రావటంతో క్రూడాయిల్ ధరలు రికార్డు స్థాయిలో తగ్గాయి. దీంతో భారత్‌కు చమురు సరఫరా చేసే విధానం మారింది. ఇది మన రిఫైనరీలకు భారీ లాభాలను అందించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడిచమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా ఆంక్షలు విధించాక లాభదాయకంగా ఉన్న అక్కడి చమురు వ్యాపారం తారుమారైంది. ప్రస్తుతం రష్యా ప్రధాన చమురు అయిన ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు ధర కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించడానికి సిద్ధమయ్యారు. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు కేవలం మూడు డాలర్లుగా ఉండేది. ఈ కొత్త ఆఫర్ డిసెంబరులో లోడ్ చేసి, జనవరిలో భారత్‌కు చేరే చమురుకు వర్తిస్తుంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలు చేస్తూ వచ్చింది. కానీ, నవంబర్ 21 నుంచి ఆంక్షలు అమల్లోకి రావటంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. అయితే, ఈ వారంలో ఉరల్స్ చమురు ధర బాగా తగ్గడంతో భారత రిఫైనరీల వైఖరి మారింది. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురును కొనుగోలు చేయడానికి కొన్ని రిఫైనరీలు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఐదో వంతు మాత్రమే ఆంక్షలు లేని సంస్థల నుంచి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# సినిమా





## రణవీర్ చెప్పిన ఉదయ్‌పూర్ కథ

[illegible]

## 23 ఏళ్ల తర్వాత వివాహ బంధంలోకి..

[illegible]





## బాలయ్యతో స్పెషల్ సాంగ్?


[illegible]

# దిగ్గజ నటుడు ధర్మేంద్ర కన్నుమూత



ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) తుదిశ్వాస విడిచారు. గతకొంత కాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం.. సోమవారం (నవంబరు 24) విషమించడంతో కన్నుమూశారు. అక్టోబరు 31న ధర్మేంద్ర అనారోగ్యం పాలవగా, ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆయన చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. రొటీన్ చెకప్ కోసమని ఆస్పత్రికి తీసుకెళ్లామని ఆయన కుటుంబం తెలిపారు. ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హేమ మాలిని, సన్నీ దేవోల్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ధర్మేంద్ర కోలుకోవాలని అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. ఈ క్రమంలో సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు.. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పిస్తున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకుంటున్నారు.ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లే శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. తన నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చారు. ఇది ఎంతో విచారకరమైన సమయం. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చిత్ర పరిశ్రమకు తీరని లోటు' అని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ధర్మేంద్ర మృతిపట్ల దర్శక, నిర్మాత కరణ్‌జోహార్ కూడా విచారం వ్యక్తం చేశారు. ఒక శకం ముగిసిందన్నారు. 'మెగాస్టార్, గొప్ప అందగాడు, ఇండియన్ సినిమా లెజెండ్ వన్ అండ్ ఓన్లీ ధర్మేంద్రజీ మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నాం' అని పేర్కొన్నారు.

## నవంబరు చివరి వారం.. థియేటర్/ఓటీటీలో అలరించే చిత్రాలివే..!



రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే. కథానాయిక. పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. హృదయాన్ని హత్తుకునే కథ, అభిమానుల మనసుల్ని తాకే భావోద్వేగాలకు తన మార్క్ హాస్యం మేళవించి ముస్తాబైన ఈ సినిమా నవంబరు 27న థియేటర్స్‌లో సందడి చేయనుంది.




ధనుష్ కథానాయకుడిగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మేన్'. కృతి సనన్ కథానాయిక. తెలుగులో 'అమర కావ్యం' పేరుతో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకురానుంది. నవంబరు 27న హిందీతో పాటు, తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండడం విశేషం.





చిత్రం: స్కూల్‌లైఫ్; నటీనటులు: పులివెందుల మహేశ్, షన్ను, సావిత్రి, సుమన్ తదితరులు; దర్శకత్వం: పులివెందుల మహేశ్; విడుదల: 28.11..2025




చిత్రం: జనతా బార్; నటీనటులు: రాయ్ లక్ష్మీ, అమన్ ప్రీత్ సింగ్, దీక్షాపంత్, శక్తికపూర్, అనూప్ సోని, ప్రదీప్ రావత్ తదితరులు; దర్శకత్వం, నిర్మాత: రమణ మొగిలి; విడుదల: 28 .11.2025



చిత్రం: మరువ తరమా; నటీనటులు: హరీశ్ ధనుంజయ, అతుల్య చంద్ర, అవంతిక హరి నల్వాల తదితరులు; దర్శకత్వం: చైతన్య వర్మ; విడుదల: 28.11.2025



చిత్రం: బిజినెస్‌మేన్; నటీనటులు: మహేశ్‌బాబు, కాజల్, నాజర్, ప్రకాశ్‌రాజ్ తదితరులు; దర్శకత్వం: పూరి జగన్నాథ్; రీరిలీజ్: 28.11.2025

# ప్రజా సేవ కోసమే నూతన ప్రోహిబిషన్,ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం..

* **ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ**

ఎల్బీనగర్, నవంబర్ 24 (భారత శక్తి): ప్రజలకు మరింత చేరువ కావడం, సేవల వేగవంతం, నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం దృష్ట్యా మీర్ పేటకు కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 14 కొత్త ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు మంజూరు చేయబడ్డాయని డిప్యూటీ కమీషనర్ తెలిపారు. ఈ క్రమంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను రెండు భాగాలుగా విభజించామన్నారు. మీర్ పేట్ ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేసి నేడు



ప్రారంభించుకున్నట్లు పేర్కొన్నారు. మీర్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం ఏర్పాటయ్యేంత వరకు సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుండి తాత్కాలికంగా కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరిండెండెంట్ ఉజ్వల రెడ్డి, సరూర్ నగర్ ఎస్ హెచ్ ఓ ఎన్. శ్రీనివాస్ రెడ్డి,ఎస్సైలు కృష్ణయ్య, ఫయాజ్, సామజ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఆదర్శంగా 'రెడీ టు సర్వ్' సంస్థ వ్యవస్థాపకుడు పెద్ది శంకర్

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): వనస్థలిపురం ప్రాంతానికి చెందిన 'రెడీ టు సర్వ్ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు పెద్ది శంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో, నందకిశోర్ సమన్వయంతో, గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకర్‌కు "ఉత్తమ ఎన్‌జీవో సామాజిక కార్యకర్త" బిరుదుతో సత్కారం జరిగింది. ఇంకా సమాజ సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం, నిరుపేదల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తిస్తూ "సోషల్ ఇంపాక్ట్ అచీవర్ అవార్డు"ను కూడా అందజేశారు. ప్రతి ఆదివారం స్థానిక ఆసుపత్రుల వద్ద భోజన సత్కారం నిర్వహిస్తూ సుమారు 300 మందికి పైగా పేదలకు వేడివేడి భోజనం అందజేయడం ఆయన ప్రధాన సేవా కార్యక్రమాల్లో ఒకటి. కష్టకాలంలో ఉన్నవారికి ఇది జీవనాధారంగా మారింది.ఈ సేవా కార్యక్రమాల దారిలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం నివాసితులు కూడా ఈ గౌరవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.




వృద్ధులు శంకర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఆశీర్వాదాలు అందజేశారు.పెద్ది శంకర్ కరుణ, నాయకత్వం, సేవా తపన సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఆయన ప్రేరణతో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

## శివశక్తి దమ్ లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహణ

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి) తట్టిన్నారం, సోమవారం: తట్టిన్నారం శివశక్తి ధామ్‌లో భక్తి స్ఫూర్తి నిండిన వాతావరణంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. మహాగణపతి, అయ్యప్ప స్వామి, కాలభైరవ సహిత అష్టాదశ శక్తిపీఠ లలితా భువనేశ్వరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పడి పూజ వైభవంగా జరిగింది. అన్నదాన ప్రభు శ్రీ మారేపల్లి. సాయి భీమ శంకర్ శర్మ, శ్రీశ్రీశ్రీ కృష్ణమోహన్ శర్మ 25వ పడి గురు స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం వైభవంగా కొనసాగింది. ఈ పూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని శరణు ఘోషలతో, భజనలతో ఆలయ ఆవరణను భక్తిరసమయం చేశారు. ఆలయ చైర్మన్



కె. మహేంద్రనాథ్ ప్రత్యేకంగా పాల్గొని అయ్యప్ప స్వాములకు ప్రసాద తాంబూలాలు అందజేశారు. అయ్యప్ప భక్తులతో నిండిన ఈ కార్యక్రమంలో గుంటూరు శీను గురు స్వామి, వేణుగోపాల్ రెడ్డి స్వామి, వెంకటరమణ రావు స్వామి, శ్రీకాంత్ రెడ్డి స్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులు అయ్యప్ప శరణం మంత్రోచ్ఛారణలతో ప్రార్థనలు చేస్తూ పూజా కార్యక్రమాన్ని ఉత్సాహంగా ముగించారు.

## కర్ణాటకలో సీఎం మారనున్నారా..?
# సిద్ధూ సరికొత్త వ్యాఖ్యలు

కర్ణాటక, నవంబర్ 24: కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొత్త చర్చకు తెరతీసేలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఐదేళ్లు సీఎంగా కొనసాగుతానని అన్నారు. సీఎం మార్పుపై తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వంపై ఆధారపడి ఉందని వెల్లడించారు. దానిని తాను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంగీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని గతంలో వ్యాఖ్యానించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు అందుకు భిన్నమైన స్వరం వినిపించడం గమనార్హం. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. అందుకు తగ్గట్టే సిద్ధూ, డీకేతో పాటు వారి శిబిరాలకు చెందిన నేతలంతా దిల్లీకి రాకపోకలు సాగించడంతో ఆ ప్రచారం తీవ్రమైంది. ఇదిలా ఉంటే.. మొన్నటి వరకు ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకే పరిమితమైన రాజకీయం..ఇప్పుడు మరో దారి పట్టింది.

## బడాబాబుల భూకబ్జాలపై హైడ్రాకు సామాన్యుల ఫిర్యాదులు

* **హైడ్రా ప్రజావాణికి వరుస ఫిర్యాదులు – ఒక్కరోజులో 64 దరఖాస్తులు**

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): బడాబాబుల భూకబ్జాల దెబ్బకు ఇబ్బందులు పడుతున్న సామాన్యులు ఇప్పుడు హైడ్రా ప్రజావాణి మీదే ఆశ. పార్కులు, రహదారులు, వానకాలువలు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలు కబ్జాకు గురై అన్యాకాంతం అవడంతో బాధితులు నేరుగా హైడ్రా వద్దకు చేరుకుంటున్నారు. గతంలో దశాబ్దాలుగా ఊరుకుంటూ వచ్చిన సమస్యలకు హైడ్రా వెంటనే చర్యలు తీసుకోవడం ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది.సోమవారం ఉదయం 11 గంటల నుండి రాత్రి 7.30 వరకు మొత్తం 64 ఫిర్యాదులు ప్రజావాణికి అందాయి. నగర కమిషనర్ ఏవి రంగనాథ్ ఫిర్యాదుదారుల సమక్షంలో గూగుల్ మ్యాప్స్, రెవెన్యూ డేటా, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ ఆధారంగా భూస్థితిగతులను పరిశీలించి సంబంధిత శాఖాధికారులకు పరిష్కార చర్యల్ని అప్పగించారు.చరువులు మూసేస్తున్న బిల్డర్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలోని వోక్షిత్ హిల్ వ్యూ కాలనీ నివాసితులు తమ వానకాలువలను మూసేసి నిర్మాణ సంస్థ అపార్టుమెంట్లు నిర్మించడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. గతంలో చెరువుకు వెళ్లే వానజల మార్గాన్ని మూసేయడంతో కాలనీలో నీరు నిల్వవుతోందని తెలిపారు.ఇక హయత్‌నగర్ మండలం బీఎన్‌రెడ్డి నగర్ పరిధిలోని హరిహరపురం కాలనీ వాసులు చెరువుల అలుగులు మూసేయడంతో 20 కాలనీలకు వరద ప్రమాదం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల మధ్య నీటి ప్రవాహ మార్గం నిలిచిపోవడంతో పరిశుభ్రత, మురుగు



సమస్యలు తీవ్రరూపం దాల్చాయని చెప్పారు. లేఅవుట్లలో రహదారుల కబ్జాలురంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పశుమాముల గ్రామంలో 1982లో ఆమోదం పొందిన లేఅవుట్‌లో రహదారులు, ప్లాట్లు ఆక్రమణకు గురైనట్లు స్థానికులు పేర్కొన్నారు. కేవలం ఒక ఎకరా భూమి కలిగిన వ్యక్తి గిరాకీ చూపిస్తూ మొత్తం లేఅవుట్‌లోకి ప్రవేశించి రహదారులు కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. బావి మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం వెంకటాపురం బ్యాంక్ కాలనీలో 372 గజాల ఓపెన్ బావిని కొంతమంది వ్యక్తులు తమ భూమిగా చూపిస్తూ ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదు అందింది. జీహెచ్‌ఎంసీ వేసిన ఫెన్సింగ్‌ను సైతం ధ్వంసం చేసి తప్పుడు పత్రాలు సృష్టించారని స్థానికులు తెలిపారు.ప్రభుత్వ భూములపై కబ్జా కోర్ల దృష్టి శేరిలింగంపల్లి మండలం పరిధిలోని సర్వే నంబరు 124/1లో 200 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలతో కబ్జా చేయాలనే ప్రయత్నం చేస్తున్నట్లు బాధితులు వివరించారు. గతంలో ల్యాండ్ యూజ్ అనుమతులు పోయిన తర్వాత ప్రభుత్వం వెనక్కి తీసుకున్న భూములను ఇప్పుడు మళ్లీ స్వాధీనం చేసుకోవాలని ఓ వర్గం యత్నిస్తోందని వారు పేర్కొన్నారు.

**స్కూల్, పార్క్ ల్యాండ్లు మింగేస్తున్నారు..**

దారులుమదీనాగూడలోని హృదయ కోఆపరేటివ్ సొసైటీ లేఅవుట్‌లో రహదారులు, ప్లాట్లు కబ్జా చేయబడ్డాయని, హెచ్‌ఎండీఏ అనుమతి లేకుండా మరో లేఅవుట్ లోకి జరిపారని ఫిర్యాదు అందింది. అలాగే కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో స్కూల్ బిల్డింగ్, పార్కింగ్‌కు కేటాయించిన భూములు కూడా పాక్షిక ఆక్రమణలకు గురయ్యాయని నివాసితులు తెలిపారు.

**ప్రజలకు ధైర్యం**

ప్రజావాణి వేదికగా ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే పరిశీలించే హైడ్రా వైఖరితో ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. మూసాపేట ఆంజనేయనగర్‌లో 2 వేల గజాల పార్క్ కబ్జా చెయ్యబడ్డ సందర్భంలో హైడ్రా నేరుగా జోక్యం చేసుకుని భూమిని కాపాడిందని ఆ ప్రాంత ప్రజలు అభినందించారు.




## 'ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన'..
# తేజస్ ప్రమాదంపై హిందుస్థాన్ ఏరోనాటిక్స్

బెంగళూరు, నవంబర్ 24 (భారత శక్తి): హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పైలట్ వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ మృతిచెందారు. ఆయన మరణం పట్ల కంపెనీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మరోవైపు ఈ ఘటనతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో హెచ్‌ఏఎల్ షేర్లు భారీగా పడిపోయాయి. దీంతో ప్రమాదాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించిన దుర్ఘటనగా కంపెనీ అభివర్ణించింది. కంపెనీ షేర్లు సోమవారం ఉదయం ఎనిమిది శాతానికి పైగా పడిపోయాయి. దుబాయ్ ఎయిర్ షోలో జరిగిన ఈ సంఘటనను 'అసాధారణ పరిస్థితుల వల్ల తలెత్తిన ప్రత్యేక దుర్ఘటన'గా హెచ్‌ఏఎల్ పేర్కొంది. ఈ ప్రమాదం తమ సంస్థ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు లేదా భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపదని హామీ ఇచ్చింది. అయినప్పటికీ.. బీఎస్‌ఈలో షేరు ఓ దశలో దాదాపు 8 శాతం తగ్గి రూ. 4,205 వద్ద ట్రేడైంది. ప్రమాదంపై విచారణ జరుపుతున్న ఏజెన్సీలకు తమ పూర్తి సహకారం ఉంటుందని హెచ్‌ఏఎల్ తెలిపింది. అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చింది. ఈ విషయంలో వాటాదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామని పేర్కొంది. ఈ తేజస్ యుద్ధ విమానం తమిళనాడులోని సూలూరు స్క్వాడ్రన్‌కు చెందినది. సుమారు ఎనిమిది నిమిషాలు విన్యాసాలు చేసిన తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విచారణకు ఆదేశించింది.

# 10 వేల ఏళ్లలో తొలిసారి పేలిన అగ్నిపర్వతం..
# విమానయాన సంస్థలు అలర్ట్!



ఇథియోపియా నవంబర్ 24: ఆఫ్రికా దేశమైన ఇథియోపియాలో ఓ అగ్నిపర్వతం 10 వేల సంవత్సరాల్లో తొలిసారిగా పేలింది.



భారీ విస్ఫోటం కారణంగా పెద్దఎత్తున బూడిదతోపాటు పొగలు వెలువడుతున్నాయి. ఇవి నింగిలో వేల మీటర్ల ఎత్తుకు చేరుకోవడంతో.. విమాన రాకపోకలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబీకి బయల్దేరిన విమానాన్ని మార్గంమధ్యలో అహ్మదాబాద్‌కు దారిమళ్లించారు. హేలీ గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, పొగ ఉత్తర భారతానికీ విస్తరించే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా వెళ్లాల్సిన విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పౌర విమానయానశాఖ అధికారులు, విమానయాన సంస్థలు ఇప్పటికే ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. పేలుడు కారణంగా విమాన కార్యకలాపాలపై ప్రభావాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని 'ఆకాశ ఎయిర్' ఓ ప్రకటనలో తెలిపింది. హేలీ గుబ్బి అగ్నిపర్వతం ఇథియోపియాలోని అఫర్ రీజియన్‌లో ఉంది. గత 10 వేల సంవత్సరాల్లో ఇది పేలినట్లు రికార్డులు లేవు. తాజా విస్ఫోటాన్ని స్థానిక చరిత్రలో అత్యంత అసాధారణమైన ఘటనల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు. దీన్నుంచి పెద్దఎత్తున వెలువడిన బూడిద, పొగ ఇప్పటికే ఎర్ర సముద్రం మీదుగా ఒమన్, యెమెన్ దేశాలకు విస్తరించాయి.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ ఉక్కుపాదం... 21 లక్షల మొబైల్ నంబర్లు కట్!

ఢిల్లీ, నవంబర్ 24 (భారత శక్తి) దేశంలో స్పామ్, మోసపూరిత కాల్స్‌ను అరికట్టేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) భారీ చర్యలు చేపట్టింది. గడిచిన ఏడాది కాలంలో ఏకంగా 21 లక్షలకు పైగా మొబైల్ నంబర్లను డిస్‌కనెక్ట్ చేయడంతో పాటు, మోసాలకు పాల్పడుతున్న సుమారు లక్ష సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు ట్రాయ్ స్పష్టం చేసింది. టెలికాం సేవలు దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు, ప్రజలు తమకు వచ్చే స్పామ్ కాల్స్, మెసేజ్‌ల వివరాలను 'ట్రాయ్ డీఎన్‌డీ' యాప్ ద్వారా రిపోర్ట్ చేయాలని కోరింది. చాలా మంది వినియోగదారులు తమ ఫోన్లలో అనవసర నంబర్లను బ్లాక్ చేస్తే సరిపోతుందని భావిస్తారని, కానీ అది సరైన పద్ధతి కాదని ట్రాయ్ పేర్కొంది. నంబర్‌ను బ్లాక్ చేయడం వల్ల ఆ కాల్స్ వ్యక్తిగతంగా మనకు రాకుండా ఉంటాయి తప్ప, మోసగాళ్లు ఇతరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపలేమని వివరించింది. అదే డీఎన్‌డీ యాప్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు ఆ నంబర్‌ను గుర్తించి, దానిని శాశ్వతంగా నిలిపివేస్తారు. గతేడాది ఇంత పెద్ద సంఖ్యలో నంబర్లపై చర్యలు తీసుకోవడానికి లక్షలాది మంది పౌరులు డీఎన్‌డీ యాప్‌ను ఉపయోగించడమే కారణమని ట్రాయ్ తెలిపింది.ఆర్థిక మోసాలు, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. అలాగే 'సంచార్ సాథీ' పోర్టల్‌లోని 'చక్షు' ద్వారా కూడా టెలికాం సంబంధిత మోసాలను రిపోర్ట్ చేయవచ్చు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, మహిళలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన తక్కువగా ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ హెచ్చరించింది.

## అమెరికా ఆంక్షలు..
## భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

రష్యా, , నవంబర్ 24 : రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత్ కు భారీ డిస్కౌంట్ తో ఆయిల్ విక్రయించేందుకు రష్యా సిద్ధమైంది. రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. దీంతో క్రూడాయిల్ ధరలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడి చమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. అమెరికా ఆంక్షలు రష్యా చమురు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో రష్యా ప్రధాన చమురు ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించేందుకు రష్యా సిద్ధమైంది. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండగా, ఇప్పుడు రెండింతలు అయింది. తాజా తగ్గింపు ధరతో వచ్చే చమురు డిసెంబర్ నెలలో లోడ్ అయి జనవరిలో భారత్‌కు చేరే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. నవంబర్ 21 నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. ఈ వారంలో ఉరల్స్ చమురు ధర భారీగా తగ్గడంతో భారత రిఫైనరీలు తిరిగి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాయి. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమయ్యాయి.

## బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు

విశాఖపట్నం, నవంబర్ 24 (భారత శక్తి): బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.

**29 తర్వాత భారీ వర్షా లు**

కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనపడపతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

## కొత్త సీజేఐ కోసం అధికారిక కారును రాష్ట్రపతి భవన్ వద్ద వదిలి వెళ్లిన జస్టిస్ గవాయ్

ఢిల్లీ, , నవంబర్ 24 (భారత శక్తి) సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తన అధికారిక కారును నూతన సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలి వెళ్లినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం స్వీకారం చేసిన విషయం విదితమే. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం జస్టిస్ గవాయ్ తాను వచ్చిన వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు.నింధేనల ప్రకారం, సీజేఐగా పదవీ విరమణ చేసిన తర్వాత మాజీ సీజేఐలు తమ అధికారిక నివాసాలను, సీజేఐకి కేటాయించే ఇతర సౌకర్యాలను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే జస్టిస్ గవాయ్ తన వాహనాన్ని జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద విడిచిపెట్టినట్లు సమాచారం. ఈ సంవత్సరం మే 14న 52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బీ.ఆర్. గవాయ్ పదవీకాలం ముగియడంతో సోమవారం నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేశారు. దీనితో సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

## పంచాయతీ ఎన్నికలు..
## అభ్యర్థులకు కేరళలోని రైతు సంఘం షరతు

కేరళ, నవంబర్ 24 (భారత శక్తి) కేరళలో డిసెంబర్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో కేరళ స్వతంత్ర రైతు సంఘం (కేఐఎఫ్ఏ) రాజకీయ నాయకుల ముందు ఒక డిమాండ్ ఉంచింది. తమ డిమాండుతో కూడిన లేఖపై సంతకం చేస్తేనే ఓట్లు వేస్తామని షరతు విధించింది. అడవి జంతువుల దాడుల నుంచి రైతుల ఆత్మరక్షణ హక్కును సమర్థిస్తూ రాతపూర్వక అఫిడవిట్‌పై సంతకం చేయాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేసింది. క్రూర మృగాల నుంచి స్వీయ రక్షణ కోసం ఒక్కోసారి వాటిపై దాడి చేసి, చంపాల్సి వస్తోందని, అలాంటి సమయాల్లో రైతుల స్వీయ రక్షణ హక్కుకు మద్దతు ఇస్తున్నట్లు రూపొందించిన రాతపూర్వక అఫిడవిట్‌పై సంతకాలు చేయాలని రైతు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను కోరింది. వన్యప్రాణుల రక్షణ చట్టం ప్రకారం అటవీ ప్రాంతం వెలుపల వన్యప్రాణులు దాడి చేస్తే ప్రాణరక్షణలో భాగంగా వాటిని చంపినా, గాయపరిచినా వారికి ఎటువంటి శిక్ష పడదు. అయితే, చట్టవిరుద్ధంగా వన్యప్రాణులను వేటాడి, చంపితే ఈ రక్షణ వర్తించదు. కొన్ని సందర్భాల్లో దాడి చేసిన వన్యప్రాణులను చంపినప్పటికీ వేటాడుతున్నట్లు ఆరోపిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని రైతు సంఘం ఆరోపించింది. అందుకే జంతువుల దాడి నుంచి తప్పించుకోవడానికి రైతుల ఆత్మరక్షణ హక్కుకు మద్దతిచ్చేలా తమ అఫిడవిట్‌పై సంతకాలు చేయాలని పేర్కొంది. 'అడవి జంతువుల దాడిలో రైతుల పక్షాన నిలబడని వారికి ఓటు వేయబోం' అనే నినాదంతో ఈ రైతు సంఘం బోర్డులను కూడా ఏర్పాటు చేసి, గ్రామాల్లో అవగాహన పెంచుతోంది.

## దిల్లీకి నొయిడా..
## తెలంగాణకు కొడంగల్

హైదరాబాద్ , నవంబర్ 24 (భారత శక్తి): దిల్లీకి నోయిడా ఎలాగో... తెలంగాణకు కొడంగల్ అలాగేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. లగచర్ల పారిశ్రామికవాడను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని చెప్పారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రూ.103 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం తయారీకి అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వాకిటి శ్రీహరిలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. మద్దూరు మహిళా సమాఖ్యకు చెందిన ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ''కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూసేకరణకు ప్రయత్నిస్తే కొందరు గిట్టనివారు రైతులను రెచ్చగొట్టారు. అధికారులపై దాడులు చేయించి... వారిపై కేసులయ్యేలా చేశారు. అన్నదాతలతో మాట్లాడి... పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి లగచర్ల, హకీంపేట, పోలేపల్లిల్లో మూడు వేల ఎకరాలను సేకరించాం.

**ఆడబిడ్డల సంతోషంతోనే ఆర్థిక వృద్ధి**

ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుంది. వారు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు బస్సులకు యజమానులను చేశాం. అంబానీ అదానీలతో పోటీపడేలా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్‌లోని శిల్పారామంలో రూ.వందల కోట్ల విలువైన 3 ఎకరాల్లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాళ్లు ఏర్పాటు చేశాం. అంతర్జాతీయ మార్కెట్ లో ఉత్పత్తులు విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నాం.

## ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజల్లోకి వెళ్లాలి

రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా అందించాలని, సుపరిపాలన ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాసంస్థల ఆమోదం తప్పనిసరి అని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) పనులకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజల్లోకి సమర్థంగా వెళ్లాలని, దీని కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజామోదం మేరకే పనులు చేపట్టాలని, అదేవిధంగా గ్రామాల్లో గ్రామసభల అనుమతి లేకుండా ఎటువంటి పనులూ ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు నుంచి పౌరసేవల లభ్యత వరకు ప్రతి అంశంలోనూ జవాబుదారీతనం అత్యంత కీలకమని, దీనిపై నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా 'కెపాసిటీ బిల్డింగ్' కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో సానుకూలత పెరిగేలా సూక్ష్మస్థాయిలో విశ్లేషణ జరగాలని సీఎం అన్నారు. ఇటీవల మొక్కజొన్న, పత్తి, అరటి రైతులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం సమర్థంగా పరిష్కరించి గిట్టుబాటు ధర కల్పించిందని గుర్తుచేశారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూల దృక్పథం పెరుగుతుందని, డేటా ఆధారిత నిర్ణయాలతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

*** త్వరలో 'అవేర్' యాప్.. సాంకేతికతకు పెద్దపీట**

ప్రభుత్వ పాలనలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. వాతావరణ హెచ్చరికలతో పాటు మొత్తం 42 రకాల కీలక సమాచారాన్ని ప్రజలకు నిరంతరం అందించేందుకు 'అవేర్ (AWARE)' యాప్‌ను త్వరలో విడుదల చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలన్నీ 'డేటా లేక్'కు అనుసంధానం కావాలని, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ బ్యాండ్‌విడ్త్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం రూపొందించిన యాప్ ద్వారా రోజువారీ తనిఖీలు చేస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రతా ఏర్పాట్లను అధ్యయనం చేసి, ఆ నమూనాను ఇతర ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు ఏర్పాటు చేసి, ఆ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సుపరిపాలన అంశాలపై డిసెంబరులో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఒక ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని, అధికారుల్లో పాలనా నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## బాబోయ్.. బయో

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి) : రాష్ట్రంలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో తీవ్రమైన లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలు పాటించడంలో పలు ఆసుపత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఏడాది వ్యవధిలో 141 ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. బయో మెడికల్ వ్యర్థాలను శుద్ధిచేయడంలో కీలక బాధ్యత వహించే ట్రీట్‌మెంట్ కేంద్రాలు సైతం నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 11 కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉంటే తొమ్మిదింటికి నోటీసులు జారీ కావడం గమనార్హం. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) వార్షిక నివేదికలో ఈ అంశాలు వెలుగుచూశాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా బయో మెడికల్ వ్యర్థాల ఉత్పత్తి, నిర్వహణ.. తీసుకున్న చర్యలపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) కి పీసీబీ ఇటీవల నివేదిక సమర్పించింది.

**ఉల్లంఘనలు ఇలా..**

బయో మెడికల్ వ్యర్థాలను నిర్లక్ష్యం చేస్తే వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ వ్యాప్తిచెందే ప్రమాదం ఉంటుంది. ఇన్ఫెక్షన్లు వ్యాపించడంతో పాటు గాలి, నీరు, నేల కలుషితమవుతాయి. వ్యర్థాల రకాలను బట్టి వేర్వేరు రంగుల డబ్బాల్లో స్టోర్ చేయాలి. పలుచోట్ల దీన్ని పాటించడం లేదు. రోజుల తరబడి వ్యర్థాలను ఆసుపత్రిలోనే ఉంచడం.. స్టోరేజీ గదులు ప్రమాణాల మేరకు లేకపోవడం.. తగినంత గాలి, వెలుతురు రాకపోవడం.. వ్యర్థాలను ఎలా వేరుచేయాలో సిబ్బందికి అవగాహన కల్పించకపోవడం.. ట్రీట్‌మెంట్ ప్లాంట్లలోనూ సరిగా శుద్ధి చేయకపోవడం.. వంటి లోపాల్ని గుర్తించిన పీసీబీ ఆసుపత్రులకు, ఇతర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది.

## కేసు రాజీ జరుగుతుంటే.. మీరేం చేశారు?

తిరుపతి , నవంబర్ 24 (భారత శక్తి): ''పరకామణిలో కానుకల చోరీకి పాల్పడ్డ రవికుమార్ ఎన్ని విదేశీ కరెన్సీ నోట్లు మీకు అప్పగించారు? ఎక్కడో ఉన్న అప్పటి ఏవీఎస్వో సతీష్‌కుమార్‌ను పిలిచి ఫిర్యాదు ఇమ్మని చెప్పడం వెనక ఎవరున్నారు? దర్యాప్తు గురించి మీకు ఏమి తెలుసు? ప్రభుత్వ ఉద్యోగైన సతీష్‌కుమార్ పరకామణి కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటుంటే మీరేం చేశారు?'' అని సీఐడీ బృందం అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను ప్రశ్నించింది. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ దర్యాప్తు బృందంతో కలిసి విచారించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణిలో కేసు దర్యాప్తు చేపట్టిన సీఐడీ బృందం డిసెంబరు 2వ తేదీలోగా నివేదిక ఇచ్చేందుకు విచారణ చేపట్టింది. అదే సమయంలో విచారణ నిమిత్తం వస్తున్న ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతి చెందారు. దీంతో దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంది. సోమవారం తిరుపతికి చేరుకున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా విచారణ చేపట్టారు. అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను విచారించారు. పరకామణి అధికారులు మొదట మీకు సమాచారమిచ్చారా అని ఆరా తీశారు. చోరీపై తితిదే విజిలెన్స్ విభాగం ఎలాంటి విచారణ చేపట్టింది, సంబంధిత దస్త్రాలు, ఇతర వివరాలు ఎవరికి సమర్పించారని ఆడిగినట్లు సమాచారం. తాము సేకరించిన విషయాలు అప్పటి సీవీఎస్వో నరసింహకిశోర్‌కు తెలియజేసినట్లు గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. అలాగే కేసు రాజీలో సతీష్‌కుమార్‌కు ఏమైనా సలహాలు ఇచ్చారా? ఆయనపై ఎవరిదైనా ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి.. సరిగ్గా గుర్తించలేదని గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత అప్పటి ఏవీఎస్వో పద్మనాభంను ప్రశ్నించారు. కేసు గురించి ఏమి తెలుసని ఆరా తీశారు.

**చెన్నై నుంచి రవికుమార్ బంధువులు**

నిందితుడు రవికుమార్ సమీప బంధువులనూ దర్యాప్తు అధికారులు విచారించారు. చెన్నైకి చెందిన దంపతులు సోమవారం సిట్ కార్యాలయానికి వచ్చారు. నిందితుడికి చెన్నైలో ఉన్న ఆస్తులు, గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్ గురించి ఆరా తీసినట్లు సమాచారం.

# శిశువుపై ఊడి పడ్డ సీలింగ్ ఫ్యాన్.. మానవ హక్కుల కమిషన్ సీరియస్

నారాయణగూడ, నవంబర్ 24 (భారత శక్తి): ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లోని ఒక గదిలో నవజాత శిశువుపై సీలింగ్ ఫ్యాన్ విరిగిపడిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సీరియస్ అయింది. కొద్దుగూడ గ్రామానికి చెందిన పాయల్ రెండ్రోజుల క్రితం పీహెచ్‌సీ కేంద్రంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం ఉదయం తల్లి, శిశువు ఉన్న మంచంపై సీలింగ్ ఫ్యాన్ ఒక్కసారిగా తెగిపడింది. ఈ సంఘటనలో శిశువుకు కుడిభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ శిశువును ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి, చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఈ ఘటనపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ సూమోటోగా కేసు నమోదు చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారికి నోటీసులు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఇచ్చిన నివేదికలో ఫ్యాన్ బోల్ట్ తుప్పుపట్టి హుక్ నుంచి వేరుపడటంతో కింద పడిందని ఇచ్చిన వివరణపై కమిషన్ ఛైర్మన్ తీవ్రంగా స్పందించారు. ప్రజా ఆసుపత్రిలో రోగులకు సురక్షిత వాతావరణం కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. శిశువు తల్లిదండ్రులు ఎదుర్కొన్న మానసిక, శారీరక బాధను దృష్టిలో ఉంచుకొని ఈ ఉదంతం గంభీరమైందని వ్యాఖ్యానించారు. తక్షణమే శిశువు తల్లి పాయల్‌కు రూ.50 వేల పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. సంఘటనపై నెలలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని, రెండు నెలల్లో పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.




## నా భర్త ఆచూకీ కనుక్కోండి సార్లూ..!

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 24 (భారత శక్తి): ఉన్న ఊరిలో ఉపాధి కరవై పొట్ట చేత పట్టుకొని దుబాయికి వెళ్లిన భర్త చొక్కాల శ్రీధర్ రెండేళ్లుగా ఫోన్ కలవక, ఆచూకీ దొరక్క భార్య, తల్లి తల్లడిల్లిపోతున్నారు. నా భర్త ఆచూకీ తెలియజేయాలంటూ కనిపించిన ప్రజాప్రతినిధిని, అధికారుల కాళ్ల వేళ్ల పడుతున్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి తమ గోడు వినిపించేందుకు కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్‌నకు చెందిన శ్రీధర్ భార్య సీహెచ్.అఖిల, తల్లి రమ. అఖిలకు శ్రీధర్‌తో పదేళ్ల కిందట వివాహం జరిగింది. అనంతరం ఇద్దరు ఆడ పిల్లలు జన్మించారు. వారికి మెరుగైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో 2022లో అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ చిన్నాచితక పనులు చేస్తుండేవాడు. అయితే 2023 నుంచి అతని ఫోన్ పని చేయటంలేదు. ఆచూకీ లభించడంలేదు. అప్పటి నుంచి



కుటుంబ సభ్యులు శ్రీధర్ రాక కోసం కళ్లల్లో వత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు. నా భర్త ఆచూకీ కనుక్కోవాలని రాష్ట్ర, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా వారికి నిరాశే ఎదురైంది. సోమవారం కలెక్టర్‌ను కలిసి భర్త ఆచూకీ కనుక్కోవటానికి ఉన్నతాధికారులతో మాట్లాడాలని వారు వేడుకున్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని చిన్నారి హత్య..

* **వరంగల్ జిల్లా కోర్టు కీలక తీర్పు**

వరంగల్‌న, నవంబర్ 24 (భారత శక్తి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని మూడేళ్ల కూతురిని అతి కర్కశంగా హతమార్చిన తల్లికి, సహకరించిన మరో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయస్థాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న సయ్యద్ యూసఫ్(ప్రధాన నిందితుడు)కి భార్య, ఇద్దరు పిల్లలు. వారిని పట్టించుకోకపోవడంతో పిల్లలను తీసుకొని భార్య యూసఫ్‌ను వదిలి పెట్టి వెళ్లింది.



అదే ప్రాంతంలో సయ్యద్ హజీరా బేగం (నిందితురాలు) తన భర్త ఇంతియాజ్ అలీ, మూడేళ్ల కూతురు ఫాతిమా సబాతో నివసిస్తున్నారు. యూసఫ్‌కు, హజీరా బేగం మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధం ఏర్పడింది. హైదరాబాద్‌లో ఉండటం క్షేమం కాదని భావించి వీరిద్దరూ చిన్నారి ఫాతిమా సబాతో కలిసి వరంగల్‌లోని రంగశాయిపేటకు వచ్చారు. పాతసామాను వ్యాపారి మహ్మద్ ఖాసిం వద్ద పనికి కుదిరారు. అదే వ్యాపార ప్రాంగణంలో ఒక గదిలో జీవిస్తున్నారు. కొన్నాళ్ల తరువాత వివాహం చేసుకోవాలని హజీరా బేగం యూసుఫ్‌ను కోరింది. చిన్నారిని అడ్డు తొలగిస్తేనే వివాహం చేసుకుంటాననడంతో ఆమె అంగీకరించింది. దీంతో యూసఫ్ 2022 ఏప్రిల్ 23న నిద్రిస్తున్న చిన్నారి రెండు చేతులను గట్టిగా పట్టుకొని గిరాగిరా తిప్పి నేలకు కొట్టాడు. ఆ వెంటనే కన్నతల్లి ఆ చిన్నారి నోరుమూసి గొంతు నులిమేసి హత్య చేసింది. ఈ విషయంపై పాత సామాన్ల వ్యాపారి ఖాసిం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ముస్క శ్రీనివాస్ దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో నేరారోపణ పత్రం దాఖలు చేశారు. తాజాగా కేసు విచారణలో నేరం రుజువు కావటంతో న్యాయస్థానం నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.



## సుక్మా జిల్లాలో 15 మంది
## మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, నవంబర్ 24 (భారత శక్తి): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని

## సిద్దిపేటలో రోడ్డు ప్రమాదం.. నవ వధువు మృతి..

* **భర్తకు తీవ్ర గాయాలు**

మిరుదొడ్డి, నవంబర్ 24 (భారత శక్తి): వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టామన్న ఆనందం ఆ నూతన దంపతులకు ఎంతో కాలం నిలవలేదు. కోటి ఆశలతో నూతన బంధంలోకి అడుగుపెట్టిన కొన్నాళ్లకే రోడ్డు ప్రమాదం వారిద్దరినీ వేరు చేసింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు ప్రాణాలు కోల్పోగా.. భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై సమత వెల్లడించిన వివరాల



ప్రకారం.. ప్రణతి (24), సాయికుమార్‌లకు ఇటీవల వివాహమైంది. ఉద్యోగ నిమిత్తం వారిద్దరూ సిద్దిపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా.. పెద్ద చెప్యాల శివారులో అదుపు తప్పిన ట్రాక్టర్ వేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. 108 వాహనంలో వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ప్రణతి మృతి చెందింది. సాయికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కొత్త జీవితంవైపు అడుగులు వేస్తున్న నూతన దంపతుల ప్రయాణం కన్నీటి కథగా మారిపోవడంతో పెద్ద చెప్యాల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి

## ముగిసిన ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): సినిమాల పైరసీ కేసులో నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి ఐదు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు అతడికి వైద్య పరీక్షలు చేయించి.. నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఐదు రోజుల కస్టడీలో రవి కీలకమైన విషయాలను వెల్లడించినట్లు సమాచారం. రవిపై ఐదు వేర్వేరు కేసులు నమోదు చేశారని ఆయన తరపు న్యాయవాది శ్రీనాథ్ వెల్లడించారు. ఈ కేసుల్లో ఒక్కదానిలో మాత్రమే కోర్టు రిమాండ్ విధించి, విచారణ నిమిత్తం ఐదు రోజుల కస్టడీకి అప్పగించిందని ఆయన వెల్లడించారు. అయితే, కస్టడీలో రవి పోలీసులకు సహకరించలేదనే ప్రచారంలో ఎటువంటి వాస్తవం



లేదని స్పష్టం చేశారు. రవి తరఫు న్యాయవాదులు ఇప్పటికే కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ

## పంచాయతీ ఎన్నికలకు సిద్ధం..
## ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించి, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్‌ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గత రెండు రోజులుగా దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు, లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై ఇవాళ హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉన్నందువల్ల విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది.

## కోకాపేట.. ఎకరం ధర రూ.137 కోట్లు



హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): నగర శివారులోని కోకాపేటలో భూములు రికార్డు ధర పలికాయి. ఎకరం ధర అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. కోకాపేటలోని నియోపోలిస్ ప్రాంతంలోని సర్వే నంబర్ 17, 18లోని భూములకు వేలం నిర్వహించగా.. సర్వే నంబర్ 17లోని భూమి ఎకరం 137.25 కోట్లు పలికింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలో 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా.. వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలీస్‌లోని సర్వే నంబర్ 17, 18లోని భూములను హెచ్‌ఎండీఏ వేలం వేసింది. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది.

## పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడి
## ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడి ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. మధుసూదన్‌రెడ్డికి చెందిన రూ.80కోట్లు అటాచ్ చేసినట్లు సమాచారం. మధుసూదన్‌రెడ్డికి చెందిన సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ కంపెనీ రూ.300 కోట్ల అక్రమాలు చేసిందని, అంతేకాకుండా ప్రభుత్వానికి మధుసూదన్‌రెడ్డి




రూ.39 కోట్ల రాయల్టీ చెల్లించలేదని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈడీ విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆస్తుల్ని అటాచ్ చేసింది.

## హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై
## ప్రభుత్వాన్ని నిలదీయండి: కార్పొరేటర్లతో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 24 (భారత శక్తి): పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేశారని.. కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని కొనియాడారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని ఆయన సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.